www.peoplesnews.in

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 77 శనివారం, ఆగస్టు 01, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad




# మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం మోదీజీ

**•ప్రధాని ట్వీట్‌ను రీ ట్వీట్ చేసిన చంద్రబాబు**



**అమరావతి,జూలై 31 :** ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనున్న భోగాపురం అంతర్జాతీయ విమానా శ్రయం ప్రారంభోత్స వానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విజయన గరం జిల్లా భోగాపురం మండలంలో నిర్మితమైన ఈ విమానాశ్రయాన్ని ఆగస్టు 1న శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించ నున్నారు. 'రేపు భోగా పురం ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తున్నాం' అం టూ ఏపీ పర్యటనపై ఎక్స్‌లో ప్రధాని పోస్ట్ చేశారు. ఉత్తరాంధ్రకు మౌలిక సదుపాయాల కల్పనలో కీలక అడుగు పడుతోందని చెప్పారు. ప్రధాని పోస్ట్‌ను ట్రాక్ చేస్తూ సీఎం చంద్రబాబు రీ పోస్ట్ చేశారు. 'ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధంగా ఉంది... మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం మోదీ జీ' అంటూ పోస్టు చేశారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలొచ్చాయని, ఉత్తరాంధ్రకు గేట్‌వేగా భోగాపురం ఎయిర్‌పోర్టు నిలుస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇక, ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

# ఉపాధి, ఉద్యోగాల కల్పనపై సిఎం దృష్టి



**•టామ్‌కాంకు కొత్త బాధ్యతలు అప్పగింత •డ్రైవింగ్, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ**
**•స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు •అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్,జూలై 31 :** టామ్‌కాంకు కొత్త బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పాస్‌పోర్టు నుంచి ఉద్యోగం వరకు సేవలు అందజేయాలని సూచించారు. విదేశీ ఉద్యోగాల కోసం టామ్‌కాం, మ్యాన్‌పవర్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. యువత ఉపాధి, నైపుణ్యాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో యువత ఉపాధి, నైపుణ్యాలపై శక్తి శాఖ అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు అంశాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. విదేశాలకు వెళ్లే కార్మికుల పూర్తి వివరాలను నమోదు చేయాలని సీఎం మార్గనిర్దేశం చేశారు. టామ్‌కాంకు మాజీ ఐఎఫ్‌ఎస్ అధికారిని సీఈవోగా నియమిస్తామని అన్నారు. డ్రైవింగ్, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

మిగతా2లో...

# కొత్తగా రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులు

**•ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్లు**
**•పిఎం కిసాన్ సమ్మాన్ నిధికి 3,15,614 కోట్ల రూపాయలు**
**•కేబినేట్ నిర్ణయాలను వెల్లడించిన అశ్వినీ వైష్ణవ్**

**న్యూఢిల్లీ,జూలై 31 :** కేంద్ర కేబినెట్ నేడు రూ. 4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈ వివరాలను మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. మొత్తం 4,50,988 కోట్ల రూపాయల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు. మిగతా2లో...





# నకిలీ ఎరువులు కొని మోసపోవద్దు

**- లైసెన్స్ పొందిన డీలర్ల వద్దే కొనండి**
**- రైతులకు వ్యవసాయ శాఖ హెచ్చరిక**

**హైదరాబాద్,జూలై 31 :** తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లోని రైతులు.. నకిలీ ఎరువులు కొనుగోలు చే సి.. ఇబ్బంది పడుతున్నట్లు వ్యవసాయశాఖకు ఫిర్యాదులు అం దాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మిగతా2లో...

# ఇందిరమ్మ టవర్స్‌కు టెండర్ ప్రారంభం

**•ఆగస్ట్ చివరలో నిర్మాణాలకు శ్రీకారం •రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**హైదరాబాద్,జూలై 31 :** ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు ఆగస్టు చివరి వారంలో శ్రీకారం చుడతామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. క్యూర్ లో ఇందిరమ్మ టవర్స్ టెండర్ ప్రక్రియ ప్రారంభం చేస్తామన్నారు.

మిగతా2లో...

# హెల్త్ కేర్ ట్రస్ట్ నిధుల సద్వినియోగం

**- అధికారులతో సమీక్షించిన సిఎస్ సంజయ్ జాజు**




# తెలంగాణలో మరోమారు సర్ గడువు పొడిగింపు

**•మరో వారం రోజులు పొడిస్తూ ఇసి ఆదేశాలు •ఆగస్ట్ 10 వరకు పొడగించినట్లు వెల్లడి**




**హైదరాబాద్,జూలై 31 :** కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని మరోమారు పొడిగించింది. ఆగస్టు 10 వ తేదీ వరకు ఓటర్లు తమ వివరాలను బీఎల్‌వో లకు అందజేయాలని స్పష్టం చేసింది. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టు 17న డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను విడుదల చేస్తామని సెప్టెంబర్ 16వ తేదీ వరకు ÷-లకెయిములు, అభ్యంతరాలను స్వీకరిస్తామని వివరించింది. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు క్లెయిములను అభ్యంతరాలను పరిష్కరిస్తామని , మిగతా2లో...



# తెలంగాణలో ఫ్యామిటీ సర్టిఫికెట్

**జారీ ప్రక్రియని ప్రారంభించిన డిప్యూటి సిఎం భట్టి**

**హైదరాబాద్,జూలై 31 :** తెలంగాణ ప్రజలకు ప్రభుత్వం కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ పక్రియ ప్రారంభమైందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇకపై కుటుంబ సభ్యుల సమాచారం.. వారి పూర్తి వివరాలతో కూడిన ఫ్యామిలీ ధ్రువపత్రాలను మిగతా2లో...

# జన నేతకు కన్నీటి వీడ్కోలు




**పెద్ది సుదర్శన్‌రెడ్డి అంతిమ యాత్రకు వేలాది జనం**
**అధికార లాంఛనాలతో అంత్యక్రియలు**
**మంత్రి సీతక్క, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు నివాళి**

# నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి

**- కల్వకుంట్ల కవిత డిమాండ్**




**హైదరాబాద్,జూలై 31 :** కార్మికులకు వ్యతిరేకంగా కేంద్రం తీసుకొచ్చిన నాలుగు కొత్త లేబర్ చట్టాలను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని టీఆర్ ఎస్ చీఫ్ కల్వకుంట్ల డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్ లోని టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయంలో

మిగతా 2లో...

# రాష్ట్రంలోని ప్రాజెక్టులకు జలకళ

**శ్రీరాంసాగర్‌కు పెరిగిన వరద ఉధృతి**

**జూరాలకు భారీగా చేరుకుంటున్న వరద**

**ఎల్లంపల్లి వద్ద శ్రీపాదకు భారీగా నీరు రాక**

**భద్రాచలం వద్ద గోదావరికి ఒకటో నంబర్ హెచ్చరిక జారీ**



**హైదరాబాద్,జూలై 31 :** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. ఆయా ప్రాజెక్టుల్లోకి వరదనీరు చేరడంతో కళకళలాడుతున్నాయి. నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ నుంచి జలాశయంలోకి 74,950 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1069.20 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 21.7 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద నీరు తరలివస్తుంది . ఎగువ నుంచి 1,46,000 క్యూసెక్కుల నీరు వస్తుండగా అప్రమత్తమైన ఇంజినీరింగ్ అధికారులు 28 గేట్లను ఎత్తి దిగువకు 1,33,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలం జలాశయానికి వరద నీటి ప్రవాహం నిరంతరాయంగా కొనసాగుతోంది. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో పాటు కడెం జలాశయం గేట్లు ఎత్తడంతో పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 15 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 1,21,354 క్యూసెక్కులు కాగా అవుట్‌ఎ÷-లో 1,08,493 క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలకు గాను ప్రస్తుతం 18.45 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గోదావరి పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఎగువ నుంచి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం ఉదయం 10.30 గంటల వరకు గోదావరి ప్రవాహం 43 అడుగులకు చేరింది. కల్యాణ కట్ట, స్నానఘట్టాలు వరద నీటిలో ఉన్నాయి. ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నీటి మట్టం 43 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ములుగు జిల్లాలో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. మేడిగడ్డ నుంచి 8.35లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. దీంతో తుపాకులగూడెంలోని సమ్మక్క బ్యారేజీ 59 గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్నారు. వాజేడు మండలం టేకులగూడెం వద్ద రహదారిపైకి వరద నీరు చేరింది. వరద నీటితో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వెంకటాపురం మండలం బోదాపురం వంతెనపైకి వరదనీరు చేరడంతో వెంకటాపురం-భద్రాచలం మధ్య రాకపోకలకు అంతరాయమేర్పడింది.

# తెలంగాణలో మరోమారు సర్ గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

అక్టోబర్19న ఫైనల్ పబ్లికేషన్‌ను విడుదల చేస్తామని వెల్లడించింది. ఈ మేరకు తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును మరోసారి పొడిగించారు. ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించే గడువును ఆగస్టు 10 వరకు పొడిగించారు. ఆగస్టు 3న ముగియాల్సిన గడువును 10వ తేదీ వరకు పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. తొలుత ఈ గడువు జులై 24 వరకే ఉండగా ఆగస్టు 3కు పొడిగించారు. తాజాగా ఆ తేదీని ఆగస్టు 10కి మార్పు చేశారు.

ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 77.12 శాతం ఎన్యూమరేషన్ పూర్తయిందని ఈసీఐ తెలిపింది. హైదరాబాద్ జిల్లాలో 56.31 శాతం, రంగారెడ్డిలో 63.43, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 61.37 శాతం పూర్తయినట్లు పేర్కొంది. ఇదిలావుంటే కేంద్ర ఎన్నికల సంఘం సెక్రటరీ నవీన్ కుమార్ తెలంగాణలో పర్యటించారు. సర్ ప్రక్రియను సమీక్షించేందుకు ఆయన రాష్ట్రానికి వచ్చారు. అంతకుముందు ఆయనకు తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి, అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వాసం వెంకటేశ్వర రెడ్డి స్వాగతం పలికారు. నవీన్ కుమార్ సుదర్శన్‌రెడ్డితో రాష్ట్రంలో జరుగుతున్న 'సర్' ప్రక్రియ పురోగతిపై చర్చించారు. అనంతరం జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎలక్షన్ ఆఫీసుకు వెళ్లి అధికారులతో మాట్లాడారు.

# తానొక ఆప్త మిత్రున్ని, ఉద్యమ సహచరున్ని కోల్పోయా...

**పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల కేసీఆర్ సంతాపం**

**పార్టీ అండగా ఉంటుందని చెప్పిన బీఆర్ఎస్ అధినేత**



**హైదరాబాద్,జూలై 31 :** పెద్ది మృతితో తానొక ఆప్త మిత్రున్ని ఉద్యమ సహచరున్ని కోల్పోయానని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేసారు. కుటుంబ సభ్యులకు పార్టీ కార్యకర్తలకు పెద్ది అభిమానులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. పెద్ది కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది... కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతితో తన సంతాపాన్ని ప్రకటించారు. ఉద్యమ సహచరున్ని, ఆప్త మిత్రున్ని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేస్తూ పెద్ది మరణం పట్ల కేసీఆర్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ పోరాటంలో, వరంగల్లు జిల్లా ఉద్యమంలో, తనతోపాటు కలిసి నడిచిన జ్ఞాపకాలను కేసీఆర్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పెద్దిని బతికించుకోవడానికి పార్టీ చేసిన విశ్వప్రయత్నాలూ, డాక్టర్లు చేసిన కృషి విఫలం కావడం పట్ల కేసీఆర్ మనోవేదనను వ్యక్తం చేశారు. తెలంగాణనే శ్వాసగా, నీతి నిజాయితీతో ప్రజాజీవనం కొనసాగిస్తూ సాగించిన రాజకీయ ప్రస్థానం ఆదర్శప్రాయమన్నారు. పోరాటాల ఖిల్లా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట గడ్డపై బీఆర్ఎస్ గులాబీ జెండాను ఎగురవేసి, మొక్కవోని ధైర్యంతో ఉద్యమించిన ధీరుడు సుదర్శన్ రెడ్డి అని కేసీఆర్ గారు కొనియాడారు. ఉద్యమకాలం నుంచి చివరిశ్వాస వరకూ గులాబీ జెండా నీడలో, పార్టీ అడుగుజాడల్లో నడిచిన పెద్ది, అటు పోరాటంలోనూ, ఇటు నియోజకవర్గ అభివృద్ధి లోనూ తనకంటూ చెరగని ముద్ర వేసుకున్నాడని తెలిపారు. పార్టీ పట్ల అత్యంత విధేయతతో పనిచేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పార్టీకి తీరని లోటని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు ఒత్తిళ్లు, నాన్-బెయిలబుల్ కేసులు, జైలు నిర్బంధాలకు కూడా లొంగని పెద్ది సుదర్శన్ రెడ్డి ఉద్యమ పటిమ, ధైర్య సాహసాలు, స్ఫూర్తి, ఆయన చేసిన సేవలు నియోజకవర్గ కార్యకర్తలు ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసుకుంటాయని అన్నారు. పెద్దిని కోల్పోయి శోక తప్త హృదయులై ఉన్న భార్యాపిల్లలకు పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని అధినేత సూచించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, పెద్ది కుటుంబ సభ్యులకు, నియోజకవర్గ కార్యకర్తలు అభిమానులకు, కేసీఆర్ గారు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# నకిలీ ఎరువులు కొని మోసపోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే అప్రమత్తమైంది. దాంతో రైతులకు కీలక సూచనలు చేసింది. నకిలీ డీఏపీ ఎరువులు కొనుగోలు చేయవద్దని రైతులకు స్పష్టం చేసింది. లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద మాత్రమే ఎరువులు కొనాలని సూచించింది. ఎరువులు కొనుగోలు చేసిన తర్వాత.. బిల్లు తప్పనిసరిగా తీసుకుని భద్రపరచుకోవాలని విజ్ఞప్తి చేసింది. తక్కువ ధర పేరుతో ఎరువులు కొని మోసపోవద్దని రైతులకు తెలంగాణ వ్యవసాయ శాఖ వివరించింది. రహదారి పక్కన, లారీల్లో విక్రయించే ఎరువులు కొనవద్దని రైతులకు విజ్ఞప్తి చేసింది. అలాగే ఎరువుల సంచిపై తయారీ, గడవు తేదీలతోపాటు ఎంఆర్‌పీ వివరాలు తప్పనిసరిగా పరిశీలించాలని రైతులను కోరింది. అనుమానాస్పద ఎరువుల బస్తాలను గుర్తిస్తే.. వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించింది. తక్కువ ధర పేరుతో మోసాలకు గురికావద్దని రైతులను హెచ్చరించింది. జిల్లాల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలను వ్యవసాయ శాఖ ముమ్మరం చేసింది. నకిలీ ఎరువుల తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించింది. అప్రమత్తతే రైతుల పెట్టుబడికి రక్షణ అని స్పష్టం చేసింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. అయితే రాష్ట్రంలోని ఐదు జిల్లాలు ముఖ్యంగా రంగారెడ్డి, సూర్యాపేట, కరీంనగర్, నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లో నకిలీ ఎరువుల ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో నకిలీ ఎరువుల విక్రేతలపై కేసులు నమోదు చేశారు. అలాగే నిందితులను అరెస్ట్ చేశారు. వారు నిల్వ చేసిన ఎరువుల బస్తాలను స్వాధీనం చేసుకుని.. వాటిని సీజ్ చేశారు.

# తెలంగాణలో ఫ్యామిలీ సర్టిఫికెట్

(మొదటి పేజీ తరువాయి)

తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవా కేంద్రాల ద్వారా పొందవచ్చని తెలిపారు. కుటుంబ వివరాలను అధికారికంగా ధ్రువీకరించుకునేందుకు ఈ సర్టిఫికెట్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ కుటుంబ సమాచారానికి సంబంధించి అవసరమైన సందర్భాల్లో ఈ ధ్రువపత్రాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు. ఫ్యామిలీ సర్టిఫికెట్ అన్ని చోట్ల చెల్లుబాటు అవుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు, వివిధ అధికారిక అవసరాలు, కుటుంబ వివరాలను సమర్పించాల్సిన సందర్భాల్లో ఈ ధ్రువపత్రం కీలకంగా మారనుందని తెలిపారు. ఇప్పటివరకు కుటుంబ వివరాల ధ్రువీకరణ కోసం ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించడంతో పాటు, ప్రజలకు సులభంగా సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రక్రియను ప్రారంభించినట్లు వెల్లడించారు. తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

# కొత్తగా రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే తలసరి సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో భారత్ మొదటి స్థానంలో ఉందని మంత్రి అన్నారు. ఈ పథకం కింద డ్యామ్‌లు, సరస్సులపై ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి 5000 మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశిరచుకున్నామని అన్నారు. రాబోయే ఐదేళ్లల్లో ఎలోటింగ్ సోలార్ ప్యానెల్ విద్యుత్ ఉత్పత్తిని 7 రెట్లు పెంచుతామని చెప్పారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి 3,15,614 కోట్ల రూపాయలు కేటాయించి నట్టు మంత్రి తెలిపారు. 2026-2030 మధ్య కాలానికి ఈ మొత్తాన్ని కేటాయించినట్టు తెలిపారు. ఇక సముద్ర మంథన్ పథకానికి 84,084 కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించింది. 2030-31 వరకూ ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు. సముద్రం అడుగున దాగున్న ముడిచమురు, సహజవాయువు వనరుల గుర్తింపు కోసం కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఖేలో ఇండియా పథకానికి సంబంధించి కేంద్రం రాబోయే ఐదేళ్ల కాలానికి రూ.29,054 కోట్లు కేటాయించిందని కూడా మంత్రి తెలిపారు. యూనీ డైరెక్షనల్ ట్విన్ ట్యూబ్ టన్నుల్స్ నిర్మాణానికి 9,779 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు.

# జన నేతకు కన్నీటి వీడ్కోలు

**నర్సంపేట,జూలై 31 :**నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి భౌతికకాయానికి శుక్రవారం జనం కన్నీటి వీడ్కోలు పలికారు. అధికార లాంఛనాల మధ్య ప్రభుత్వం అంత్యక్రియలు నిర్వహించింది. ఈ నెల 26న గుండెపోటుతో హనుమకొండలోని రోహిణి ఆస్పత్రిలో చేరిన పెద్ది సుదర్శన్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించి శుక్రవారం అర్ధరాత్రి12:30 గంటలకు మరణించినట్టు వైద్యులు తెలిపారు. అక్కడి నుంచి ఆయన భౌతికకాయాన్ని హనుమకొండ మీదుగా నర్సంపేటకు తీసుకొచ్చారు. వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై అడుగడుగునా పెద్దికి జనం నివాళులర్పించారు. గిర్నిబావి సెంటర్ నుంచి నర్సంపేట వరకు 10 కిలో మీటర్ల వరకు రోడ్డుపై అంతిమ యాత్ర జనసందోహంతో కొనసాగింది. పట్టణంలోని అయ్యప్ప గుడి నుంచి ప్రధాన రహదారిపై వేలాది మంది అభిమానుల నడుమ అంతిమ యాత్ర సాగింది. అక్కడి నుంచి సాయంత్రం 6 గంటలకు నల్లబెల్లిలోని పెద్ది స్వగృహానికి ఆయన మృతదేహాన్ని తీసుకొచ్చారు. **నివాళులర్పించిన కేటీఆర్, హరీశ్‌రావు, మంత్రి సీతక్క** పెద్ది సుదర్శన్‌రెడ్డి భౌతికకాయానికి మంత్రి సీతక్క, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, గంగుల కమలాకర్, సత్యవత్‌రాథోడ్, మాజీ ఎంపీ కవిత, ఎమ్మెల్సీలు పోచంపెల్లి శ్రీనివాసరెడ్డి, గోరెటి వెంకన్న, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డితో పాటు ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు నివాళులర్పించారు. అంతిమ యాత్రలో హరీశ్‌రావు, కేటీఆర్ తదితర బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. వర్షం కురిసినా అభిమానులు అంతిమ యాత్రలో పాల్గొని పెద్దికి తుది వీడ్కోలు పలికారు. ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించడంతో దానికి తగ్గ ఏర్పాట్లు చేశారు. రాత్రి 8 గంటలకు ఆయన కుమారుడు నిదర్శన్ రెడ్డి చితికి నిప్పంటించారు.

# నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రక్షణ సేన ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ కార్యక్ర మంలో ఆమె మాట్లాడారు. ఆ చట్టాలకు వ్యతిరేకంగా తమిళనాడు, వెస్ట్ బెంగాల్ రాష్ట్రాలు తీర్మానాలు చేశాయని ఆమె గుర్తుచేశారు. కార్మి కులకు, ఉద్యోగులకు, టీచర్లకు అన్యాయం జరగనివ్వబోమని ఆమె స్పష్టం చేశారు. టీఆర్ఎస్ కార్మికుల ఫ్రెండ్లీగా అండగా ఉంటుందని తెలిపారు. పరిణితి చెందిన ప్రజాస్వామ్యం అంటే ఆ దేశంలో పనిచేసే ప్రజలకు సంతోషంగా పనిచేసే వాతావారణం కల్పించాలన్నారు. ట్రేడ్ యూని యన్ అంటే రాజ్యాంగ బద్ధంగా మనకు దక్కిన హక్కు అనీ, దాన్ని కాపాడుకుందామని పిలుపుని చ్చారు. మల్కాజిగిరి ఎంపీగా ఉన్న సమయంలో కనీస వేతనం రూ.20 వేలు ఉండాలని, సీఎం అయ్యాకేమో రూ.16 వేలు ఇస్తామంటూ రేవంత్ రెడ్డి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. షెడ్యూల్ ఆఫ్ ఇండస్ట్రీస్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లను చలాన్ల పేరుతో శ్రమదోపిడీ చేస్తున్నారనీ, ఐటీ, పార్మా రంగాల్లో యూనియన్లు లేకపోవడంతో అక్కడా అదే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ సంతోషంగా ఉన్నప్పుడే దేశం ముందుకెళ్తుందనీ, అలాంటి వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆమె గుర్తుచేశారు.

# హెల్త్ కేర్ ట్రస్ట్ నిధుల సద్వినియోగం

**హైదరాబాద్,జూలై 31 :** తెలంగాణ ఉద్యోగుల హెల్త్ కేర్ ట్రస్ట్‌పై రాష్ట్ర సీఎస్ సంజయ్ జాజు శుక్రవారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. హెల్త్ కేర్ ట్రస్ట్ నిధుల సద్వినియోగంపై సంబంధిత అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పలు అశాలపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశర చేశారు. చికిత్స ప్యాకేజీ రేట్లపై సమగ్ర సమీక్షకు నిర్ణయించినట్లు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ, సబ్ కమిటీల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయా ఆస్పత్రుల సేవల నాణ్యతపై నిరంతర పర్యవేక్షిస్తున్నట్లు స్పష్టం చేశారు. అత్యవసర వైద్య సేవలకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని సీఎస్ సంజయ్ జాజు మార్గనిర్దేశర చేశారు. 24 గంటల హెల్ప్ సిస్టమ్, వేగవంతమైన అనుమతి పక్రియ చేపట్టాలని సూచించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ఆలస్యం లేకుండా వైద్య సహాయం అందజేయాలని ఆదేశించారు. పారదర్శకంగా, సమర్థవంతంగా ట్రస్ట్ నిర్వహించాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు.

# ఉపాధి, ఉద్యోగాల కల్పనపై సిఎం దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జర్మన్, జపనీస్, కొరియన్ సహా విదేశీ భాషలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. బ్లూ కాలర్ ఉద్యోగ శిక్షణార్థులకు స్కాలర్‌షిప్‌లపై అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఇంజినీరి ంగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఏటీసీల్లో ఈవీ సర్వీసింగ్, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెడతామని చెప్పుకొచ్చారు. నర్సుల గ్లోబల్ డిమాం డ్‌కు అనుగుణంగా కొత్త నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సంబంధిత శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ టవర్స్‌కు టెండర్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తొలి విడతలో 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. మరో 4 నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు పూర్తయిందని చెప్పారు. లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఆగస్టు 10వ తేదీ తర్వాత ఈ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేదన్నారు. ఆధార్‌తో పాటు ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ కూడా చెల్లుబాటు అవుతుందని వివరించారు. ఇల్లు రాకపోతే రూ.10 వేల ఈఎండీ 100 శాతం రీఫండ్ చేస్తామని స్పష్టం చేశారు. యూపిఐ లేదా నెట్ బ్యాంకి ంగ్ ద్వారా చెల్లిస్తే అదే ఖాతాకు నగదు రీఫండ్ చేస్తామని చెప్పారు. ఒక్కో ఫ్లాట్ మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉందని వివరించారు. లబ్దిదారుల పేరుపై 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్ ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు.

# గోదావరి వరదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా ఎస్ పి కేకన్ సుధీర్ రామ్‌నాథ్ ఐపీఎస్**





**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 31( పీపుల్స్ న్యూస్)**
ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదికి వరద నీటి ప్రవాహం వేగంగా పెరుగుతోంది. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం మూడో ప్రమాద హెచ్చరిక కి చేరుకున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎస్ పి సూచించారు.ముఖ్యంగా గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు, బ్యాక్‌వాటర్ ప్రభావిత గ్రామాల ప్రజలు పరిస్థితులను నిరంతరం గమనిస్తూ పోలీసు, రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ శాఖ అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఏటూరునాగారం, వాజేడు, మంగపేట పేరూరు కన్నాయిగూడెం వెంకటాపురం మండలాల్లోని గోదావరి నది పరివాహక ప్రాంతాలు, బ్యాక్‌వాటర్ ప్రభావిత గ్రామాల ప్రజలు ప్రత్యేక అప్రమత్తతతో ఉండాలని ఎస్పీ సూచించారు. అవసరమైతే అధికారులు సూచించే సురక్షిత ప్రాంతాలకు వెంటనే తరలివెళ్లాలని తెలిపారు.మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లరాదని, వరద ఉధ్ధృతి కొనసాగుతున్న సమయంలో నదిలోకి దిగడం, పడవల ద్వారా ప్రయాణించడం, సాహసాలకు పాల్పడడం ప్రాణాపాయమని హెచ్చరించారు.అలాగే గోదావరి ఒడ్డున నివసించే ప్రజలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు చిన్నారులను నది వద్దకు వెళ్లనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని సూచించారు.జిల్లా పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖలు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని, అత్యవసర పరిస్థితుల్లో స్థానిక పోలీసు అధికారులకు వెంటనే సమాచారం అందించాలని ఎస్ పి తెలిపారు.

# సేవలకు సలాం...5వ కమాండెంట్ కె. సుబ్రహ్మణ్యం కు ఘన వీడ్కోలు




**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 31 (పీపుల్స్ న్యూస్)**
ములుగు జిల్లా చల్వాయిలోని తెలంగాణ స్పెషల్ పోలీస్ 5వ బెటాలియన్ కమాండెంట్ శ్రీ కె. సుబ్రహ్మణ్యం పదవీ విరమణ సందర్భంగా బెటాలియన్ ఆవరణలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ శ్రీ కె. సుబ్రహ్మణ్యం బెటాలియన్ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఆకట్టుకునే వీడ్కోలు పరేడ్ నిర్వహించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం జరిగిన సన్మాన కార్యక్రమంలో శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేసి, ఆయన పోలీసు శాఖకు అందించిన విశిష్ట సేవలను కొనియాడారు.తన పదవీ కాలంలో బెటాలియన్‌లో క్రమశిక్షణ, మౌలిక వసతుల అభివృద్ధి, సిబ్బంది సంక్షేమం, శిక్షణా ప్రమాణాల పెంపు ప్రజాసేవకు విశేష కృషి చేసి బెటాలియన్ అభివృద్ధికి విశేష సేవలందించారని అధికారులు పేర్కొన్నారు.అనంతరం బెటాలియన్ అధికారులు, సిబ్బంది గ్రాండ్ సెండ్–ఆఫ్ నిర్వహించి భావోద్వేగపూర్వకంగా వీడ్కోలు పలికారు. పుష్పవర్షం మధ్య కమాండెంట్ శ్రీ కె. సుబ్రహ్మణ్యం ని ఘనంగా సాగనంపుతూ, ఆయన పదవీ విరమణ అనంతర జీవితం ఆయురారోగ్యాలు, ఆనందం, సుఖశాంతులతో నిండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు అదనపు కమాండెంట్ సీతారాం సహాయ కమాండెంట్లు కృష్ణ ప్రసాద్, ధర్మారావు , ఆర్.ఐలు, కిరణ్, భాస్కర్, స్వామి,శ్రీధర్ సాయిబాబు,వెంకటేశ్వర్లు, మంత్రివర్గ సిబ్బంది, పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జంపన్నవాగులో గల్లంతైన వ్యక్తి కోసం ముమ్మర గాలింపు చర్యలు

**- జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ ఐపీఎస్ పరిశీలన**






**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 31 (పీపుల్స్ న్యూస్)**
ములుగు జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జంపన్నవాగులో ప్రమాదవశాత్తు గల్లంతైన వ్యక్తి కోసం పోలీసు, ఎస్‌డీఆర్‌ఎఫ్ ( ఎస్ డి ఆర్ ఎఫ్), జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ( డి డి ఆర్ ఎఫ్) బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.బుధవారం జంపన్నవాగు ప్రధాన వంతెన నుంచి ఊరట్టం వంతెన మధ్య ప్రాంతంలో తన స్నేహితులతో కలిసి మద్యం మత్తులో నీటిలో ఈతకు దిగిన పీట్ల తిమ్మయ్య (45), తండ్రి రంగయ్య, వడ్డెర, వృత్తి: కారు డ్రైవర్, స్వస్థలం: కొండాపూర్ గ్రామం, ఘట్‌కేసర్ మండలం ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. ప్రస్తుతం ఆయన ఆచూకీ లభించలేదు.ఈ ఘటనపై జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కేకన్ సుధీర్ రామ్‌నాథ్, ఐపీఎస్ సంఘటన స్థలాన్ని సందర్శించి గాలింపు చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, పస్రా సీఐ దయాకర్ లతో కలిసి సంఘటన స్థలాన్ని ఎస్ పి పరిశీలించారు.జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డి డి ఆర్ ఎఫ్)కు చెందిన ఇద్దరు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, 25 మంది శిక్షణ పొందిన నిపుణులైన సిబ్బంది ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో సమన్వయంగా జంపన్నవాగు మొత్తం పరిధిలో విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు, ముక్య ంగా 9 కిలోమీటర్ల పరిధిలో ఇంచు ఇంచు గాలింపు చేసారు .ఇసుకమెటలలో చిక్కుకపోయి ఉండచ్చు అనే నేపథ్యంలో గాలింపు బృందం స్వయంగా వాగు లోకి దిగి పరిశీస్తున్నారు,ఏ క్షణమైనా మృతదేహం లభించే అవకాశం ఉన్నందున గాలింపు



చర్యలు నిరంతరంగా కొనసాగుతున్నాయి. భారీ వర్షాల కారణంగా నదులు, వాగులు ప్రమాదకరంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు మద్యం సేవించి నీటిలోకి దిగడం, వాగులు, నదుల్లో ఈత కొట్టడం వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడవద్దని జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# రేషన్ కార్డుదారులకు గుడ్ న్యూస్.. 3 నెలల బియ్యం ఒకేసారి పంపిణీ




**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 31 ( పీపుల్స్ న్యూస్)**
రేషన్ కార్డు లబ్ధిదారుల విషయంలో రాబోయే వర్షాల వల్ల దృష్ట్యా ఒకేసారి మూడు నెలల సరిపడా రేషన్ బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఆగస్టు , సెప్టెంబర్ అక్టోబర్ 2026 ఈ మూడు నెలలకు సంబంధించిన బియ్యం ఆగస్టు నెలలోనే పంపిణీ జరిగేలా చూడాలని , జులై చివరి వారంలోనే వర్షాల వల్ల రాబోయే రోజుల్లో వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంది.బిదేశవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రంలోనే రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. ఒక్కో లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యం తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేస్తోంది.ములుగు జిల్లాలో దాదాపు 1 లక్ష 3 వేలకి పైగా కార్డులు ఉన్నాయి. ఒకేసారి మూడు నెలలకు సరిపడ కోటా 5,514 ఎం టి బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినదని,తగు ఏర్పాట్లు చేసినామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సయ్యద్ షా ఫైసల్ హుస్సైని తెలియపరిచినారు.బిఒకేసారి మూడు నెలలకు సంబంధించి ఒక్కో కార్డుదారుడు 3 సార్లు వేలి ముద్ర (థంబ్) వేయాల్సి ఉందని, దీనికి తోడు సర్వర్ సమస్యలు రాకుండా తగు చర్య లు తీసుకుంటున్నామనిజిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తెలియపరిచినారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సీతక్క





**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 31 (పీపుల్స్ న్యూస్)**
మల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కత్తి మొగిలి గారి తల్లి కత్తి బుచ్చమ్మ ఇటీవలే అనారోగ్యంతో చనిపోగా ఈ రోజు వారి నివాసంలో రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీమతి దనసరి అనసూయ సీతక్క గారు వారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారుమంత్రి సీతక్క గారి వెంట ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి,మల్లంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పల్లె జైపాల్ రెడ్డి,వార్డు సభ్యులు కొంగరి నరేందర్,జిల్లా నాయకులు ఓరుగంటి అనిల్,యూత్ నాయకులు గూడెపు రాకేష్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

**- అధికారులు ముందస్తు చర్యలతో సన్నద్ధంగా ఉండాలి.**
**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**



**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 31 (పీపుల్స్ న్యూస్)**
ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదిలో వరద నీటితో నీటిమట్టం వేగంగా పెరుగుతున్నందున అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడ హేమంత్ సహదేవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు చేపల వేట, ఈత వంటి కార్యకలాపాల కోసం నదులు, వాగులు, చెరువుల వద్దకు వెళ్లవద్దని, అత్యవసర పరిస్థితులు మినహా రానున్న రెండు, మూడు రోజుల పాటు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ప్రజలకు ఏవైనా సమస్యలు ఎదురైతే జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1800-425-7109కు సమాచారం అందించాలని సూచించారు.24/7 టోల్ ఫ్రీ నెంబర్ ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపడతారని పేర్కొన్నారు. మండల, జిల్లా, గ్రామ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి సహాయక చర్యలు చేపడుతున్నారని తెలిపారు.ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి నదిలో నీటిమట్టం వేగంగా పెరుగుతున్నందున అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయానికి రామన్నగూడెం వద్ద గోదావరి నీటిమట్టం 75.47 అడుగులు (16.97 మీటర్లు) నమోదైంది. మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 73.32 అడుగులు (14.82 మీటర్లు), రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి 74.32 అడుగులు (15.82 మీటర్లు) కాగా, ప్రస్తుతం గోదావరి నీటిమట్టం రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి ప్రవహిస్తోంది. మూడో ప్రమాద హెచ్చరిక స్థాయి 75.82 అడుగులు (17.32 మీటర్లు) కాగా, ప్రస్తుతం ఆ స్థాయికి అత్యంత చేరువలో ఉంది. ప్రస్తుతం ఉన్న ప్రవాహ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గోదావరి పరివాహక ప్రాంతాల్లోని కన్నాయిగూడెం, ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాల అధికారులు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు.తుపాకులగూడెంలోని సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు మధ్యాహ్నం 2 గంటల వరకు 14,03,500 క్యూసెక్కుల వరద నీరు చేరుతుండగా, అంతే పరిమాణంలో నీటిని స్పిల్‌వే గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజీ ఫ్రీ ఫ్లో పరిస్థితిలో ఉందని తెలిపారు.గోదావరి నీటిమట్టం పెరగడంతో జంపన్నవాగు, ఇతర వాగులు, లోతట్టు ప్రాంతాల్లో బ్యాక్‌వాటర్ ప్రభావం ఏర్పడే అవకాశం ఉన్నందున గతంలో ముంపునకు గురైన గ్రామాలు, ఆవాసాలు, ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.గతంలో గుర్తించిన పునరావాస కేంద్రాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని, అవసరమైతే ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, విద్యుత్, వైద్య సేవలు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబా టులో ఉండేలా చూడాలని ఆదేశించారు.గ్రామాల ప్రజాప్రతి నిధులు, సర్పంచులు, స్థానిక నాయకులతో సమన్వయం చేసుకొని గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని, రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.రెవెన్యూ, పోలీసు, నీటిపారుదల, పంచాయతీరాజ్, వైద్య, విద్యుత్ తదితర శాఖల అధికారులు తమ ప్రధాన కార్యాలయాల్లో అందుబాటులో ఉంటూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

## ఆర్జీ వన్ లో పర్సనల్ మేనేజర్‌గా రెడ్డిమల్ల తిరుపతి బాధ్యతల స్వీకరణ

**:- నూతన పర్సనల్ మేనేజర్‌కు జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్ శుభాకాంక్షలు.**



**రామగుండం,జులై 31**

రామగుండం ఏరియా 1లో పర్సనల్ మేనేజర్‌గా రెడ్డిమల్ల తిరుపతి శుక్రవారం అధికారికంగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా రామగుండం ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ నూతన పర్సనల్ మేనేజర్‌ను అభినందించి,ఉద్యోగులు, కార్మికులు మరియు యాజమాన్యం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తూ సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు. తమ పరిపాలనా అనుభవం, సమర్ధ నాయకత్వంతో పర్సనల్ విభాగాన్ని మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.అదే సందర్భంగా పదవీ విరమణ పొందుతున్న పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి కార్యాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం సాంప్రదాయబద్ధంగా, సాదరంగా రెడ్డిమల్ల తిరుపతి ని పర్సనల్ మేనేజర్ కుర్చీలో ఆసీనులను చేసి బాధ్యతలను అప్పగించడం జరిగినది.ఈ సందర్భంగా పర్సనల్ అధికారులు వేణు,శ్రావణ్ కుమార్,హనుమంతరావు, పీవో దేవాచారి,కార్యాలయ అధికారులు,ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో నూతన పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

## ప్రజల సమస్యల కోసం బి.ఆర్.ఎస్ పార్టీ కృషి.... సీనియర్ నాయకుడు మేకల రాము యాదవ్




**మల్కాజిగిరి జులై 31**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ కృషి చేస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్ తెలిపారు మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు గౌతమ్ నగర్ డివిజన్,మీర్జాలగూడ డివిజన్లో దశాబ్ద కాలంగా పాడైపోయిన బోర్వెల్ మరమ్మతులు డీజిఎం రమణ రెడ్డి పర్యవేక్షణలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు పవర్ బోర్ మరమ్మతులకు ఇన్స్పెక్షన్ జరిగాయి ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు,హేమంత్ కుమార్,రామారావు,సత్యనారాయణ,రవి,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాము యాదవ్,మర్రి శ్రీను,శెంకర్,ఎస్వీఆర్ వెంకట్,సిద్ధులు పాలుకొన్నారు.

## సువర్ణ వనమాల దశదిన కర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**రామగుండం,జులై 31**


ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు సహోదరి,రాష్ట్ర ఐటీ ఐ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మేనత్త సువర్ణ వనమాల దశదిన కర్మ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్.రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి,సువర్ణ వనమాల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి,డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## పడవ సహాయంతో అత్యవసర పునరుద్ధరణ చేపట్టిన

**- టీజీఎన్‌పీడీసీఎల్ అధికారులు**















**ములుగు జిల్లా ప్రతినిధి జులై 31( పీపుల్స్ న్యూస్)**

గోదావరి నదిలో బ్యాక్‌వాటర్ భారీగా పెరగడంతో వాజేడు మండల పరిధిలోని 11 కేవీ గుమ్మడిదొడ్డి ఫీడర్ కింద ఉన్న ఏరియల్ బంచ్డ్ లైన్ ( ఎ జి ఎల్) పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు డి టి ఆర్ లు) నీట మునిగిపోయాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో టీజీఎన్‌పీడీసీఎల్ అధికారులు వెంటనే అప్రమత్తమై, ములుగు సూపరింటెండింగ్ ఇంజనీర్ పర్యవేక్షణలో, ఏటూరునాగారం డివిజన్ డివిజనల్ ఇంజనీర్ ఆధ్వర్యంలో, వాజేడు అసిస్టెంట్ ఇంజనీర్ మరియు ముగ్గురు సిబ్బంది పడవ సహాయంతో నీట మునిగిన ప్రాంతాలకు చేరుకుని అత్యవసర చర్యలు చేపట్టారు.భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, నీటిలో మునిగిన 14 ఏజీఎల్ డీటీఆర్‌లను విద్యుత్ వ్యవస్థ నుంచి వేరు (డిస్‌కనెక్ట్) చేసి, ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా విద్యుత్ సరఫరాను విజయవంతంగా పునరుద్ధరించారు.దీంతో ధూలాపురం, సుందరయ్య కాలనీ, గుమ్మడిదొడ్డి, ఇప్పగూడెం, చీకుపల్లి, పెద్ద గొల్లగూడెం, చెరుకూరు, శ్రీరాచ నగర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా తిరిగి పునరుద్ధరించబడింది.వరద ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని టీజీఎన్‌పీడీసీఎల్ అధికారులు తెలిపారు. ప్రజలు నీటిలో మునిగిన విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని, ఏవైనా విద్యుత్ సంబంధిత అత్యవసర సమస్యలు గమనించిన వెంటనే టీజీఎన్‌పీడీసీఎల్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## డివిజనల్ పరిపాలన అధికారి సేవలు చిరస్మరణీయం

**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



**ములుగు జిల్లా ప్రతినిధి జులై 31 (పీపుల్స్ న్యూస్)**

డివిజనల్ పరిపాలన అధికారిగా అల్లోజు రమాదేవి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు.శుక్రవారం ములుగు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో డివిజనల్ పరిపాలన అధికారి అల్లోజు రమాదేవి పదవీ విరమణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలో డివిజనల్ పరిపాలన అధికారి అల్లోజు రమాదేవి అంకితభావం తో, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ సహచర ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఉద్యోగ జీవితంలో అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన డివిజనల్ పరిపాలన అధికారి అల్లోజు రమాదేవి మాట్లాడుతూ, ఉద్యోగ జీవితంలో తనకు సహకరించిన అధికారులు, సహచర ఉద్యోగులు, సిబ్బంది ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు.విధి నిర్వహణలో ఎదురైన సవాళ్లను అధికారుల మార్గదర్శకత్వం, సహచర ఉద్యోగుల సహకారంతో అధిగమించగలిగానని తెలిపారు. తనపై ప్రేమాభిమానాలు చూపి పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అల్లోజు రమాదేవిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, ఏవో అల్లం రాజ్ కుమార్, మహేష్ బాబు,వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పారదర్శకంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ

**- ప్రతిపాదిత కొత్త కేంద్రాలను పరిశీలించిన**

**- ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి**









**ములుగు జిల్లా ప్రతినిధి జులై 31 (పీపుల్స్ న్యూస్)**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్--2026 కార్యక్రమంలో భాగంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయాలని ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కె. కృష్ణవేణి అధికారులను ఆదేశించారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్--2026 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.శుక్రవారం ములుగు మండలంలోని చింతకుంట, జగ్గన్నగూడెం గ్రామాల్లో ప్రతిపాదిత కొత్త పోలింగ్ కేంద్రాలను ఎన్నికల నమోదు అధికారి ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రతిపాదిత పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన భవనాల స్థితిగతులు, ఓటర్లకు సులభంగా చేరుకునే వీలుందా లేదా, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, వేచి ఉండేందుకు తగిన స్థలం, దివ్యాంగులు, వృద్ధులు సులభంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ర్యాంపుల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే పోలింగ్ కేంద్రాల పరిధి, ఓటర్ల సంఖ్య, గ్రామాల భౌగోళిక పరిస్థితులు, ఓటర్ల ప్రయాణ దూరం తగ్గేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, ప్రతి ఓటరుకు సౌకర్యవంతమైన, పారదర్శకమైన, సులభమైన ఓటింగ్ వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతిపాదిత కేంద్రాల్లో ఉన్న లోపాలను వెంటనే గుర్తించి, ఎన్నికలకు ముందే అన్ని మౌలిక వసతులు పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం గ్రామస్థులతో మాట్లాడిన ఎన్నికల నమోదు అధికారి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేపడుతున్నామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఎన్నికల సంఘం లక్ష్యాలను విజయవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు.ఈ పరిశీలన కార్యక్రమంలో ములుగు తహసీల్దార్ ఎన్. విజయ భాస్కర్, బూత్ లెవల్ అధికారులు, రెవెన్యూ శాఖ సిబ్బంది, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి -- పూర్తి జీవిత విశేషాలు

**- పూర్తి పేరు: పెద్ది సుదర్శన్ రెడ్డి**
**- తండ్రి పేరు: రాజి రెడ్డి**
**- రాజకీయ పార్టీ: భారత్ రాష్ట్ర సమితి ( బి ఆర్ ఎస్)**
**నియోజకవర్గం: నర్సంపేట, వరంగల్ జిల్లా, తెలంగాణ.**



**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 31 (పీపుల్స్ న్యూస్)**
వ్యక్తిగత వివరాలువిద్యార్హత: ఇంటర్మీడియట్ (1991లో వరంగల్ హబూబియా పంజతన్ కళాశాలలో పూర్తి చేశారు). వృత్తి: వ్యవసాయం, రాజకీయాలు. భార్య: నల్లబెల్లి ప్రాంతంలో జెడ్ పి టి సి సభ్యురాలిగా పనిచేశారు. రాజకీయ ప్రస్థానంతెలంగాణ రాష్ట్ర ఉద్యమ కాలంలో టి ఆర్ ఎస్ (ప్రస్తుత బి ఆర్ ఎస్)లో చురుకుగా పనిచేశారు.2014లో నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసినప్పటికీ విజయం సాధించలేదు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో దీ=ూ అభ్యర్థిగా గెలిచి నర్సంపేట ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2018--2023 మధ్య నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యేగా సేవలందించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి దొంతి మాధవ రెడ్డి చేతిలో ఓడిపోయారు. ఎమ్మెల్యేగా చేసిన ముఖ్య పనులురోడ్ల అభివృద్ధి గ్రామీణ మౌలిక సదుపాయాల విస్తరణకు కృషి.తాగునీటి, సాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు.విద్యా, వైద్య రంగాల్లో ప్రభుత్వ పథకాల అమలుకు సహకారం.నర్సంపేట నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల అమలుపై దృష్టి. ఎన్నికల అఫిడవిట్ (2023)వయస్సు: 49 సంవత్సరాలు.స్వీయ వృత్తి: ఎమ్మెల్యే వ్యవసాయదారుడు.ఎ న్నికల అఫిడవిట్ ప్రకారం క్రిమినల్ కేసులు లేవు. రాజకీయ శైలిపెద్ది సుదర్శన్ రెడ్డి నర్సంపేట ప్రాంతంలో గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేసే నాయకుడిగా గుర్తింపు పొందారు. తెలంగాణ ఉద్యమం తర్వాత బి ఆర్ ఎస్ లో తన రాజకీయ ప్రస్థానాన్ని బలోపేతం చేసుకొని 2018లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆయనకు వ్యవసాయ రంగంతో అనుబంధం ఉండటం వల్ల రైతుల సమస్యలపై కూడా దృష్టి సారించినట్లు స్థానికంగా గుర్తింపు ఉంది.

# రిటైర్మెంట్ సొమ్ము విషయంలో అప్రమత్తంగా ఉండాలి



హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనర్









**హైదరాబాద్ కమిషనరేట్,క్రైమ్ బ్యూరో జూలై 31 (పీపుల్స్ న్యూస్) :**
పదవీ విరమణ తర్వాత వచ్చే రిటైర్మెంట్ సొమ్ము విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అధిక వడ్డీల ఆశతో మోసపోకుండా నిధులను సురక్షితమైన ప్రభుత్వ సంస్థలలోనే డిపాజిట్ చేసుకోవాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనర్ సూచించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 42 సంవత్సరాల పాటు సుదీర్ఘ అంకితభావంతో సేవలందించి వయోపరిమితి కారణంగా పదవీ విరమణ పొందిన 25 మంది పోలీస్ అధికారులకు సిటీ పోలీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనర్, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందిన అధికారులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను , సొసైటీ తరపున రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను అందజేశారు. సైకిళ్లపై పెట్రోలింగ్ చేసిన నాటి నుండి నేడు ఆధునిక ఇన్నోవా కార్లలో పెట్రోలింగ్ చేసే స్థాయి వరకు పోలీస్ శాఖ ప్రస్థానాన్ని చూసిన ఈ అధికారుల కష్టమే తెలంగాణ పోలీసు శాఖకు దేశంలోనే సాటిలేని గుర్తింపు తెచ్చిందని సీపీ కొనియాడారు. “వన్స్ ఏ పోలీస్ మ్యాన్, ఆల్వేస్ ఏ పోలీస్ మ్యాన్” అని పేర్కొంటూ, అధికారుల ఫిట్‌నెస్‌కు సహకరించిన వారి కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ వేడుకలో సిసిఎస్.డిడి ఏసిపి బి.బాబు రావు , సిపిఆర్ నార్త్ జోన్ పి.జాన్ లతో పాటు 9 మంది ఎస్.ఐ లు, 11 మంది ఎ.ఎస్.ఐ/ఆర్.ఎస్.ఐ లు, ఒక హెడ్ కానిస్టేబుల్ , ఇద్దరు ఎల్.జి.ఇ లు కలిపి మొత్తం 25 మంది అధికారులు వీడ్కోలు పొందగా, విధి నిర్వహణ ముగించుకున్న అధికారులను సగర్వంగా వారి నివాసాల వద్ద దింపడానికి ప్రత్యేకంగా ప్రభుత్వ వాహనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, సొసైటీ కార్యదర్శి నల్ల శంకర్ రెడ్డి, ఏఏఓ యాదగిరి, ఉపాధ్యక్షుడు ఎండీ ఆసిఫ్ ఖాన్, కోశాధికారి జి.ఎం.ఎస్. విక్టర్, జాయింట్ సెక్రటరీ సి. నవీన్, సభ్యులు ఎం. కేశవ్, కె. రత్నకుమారి, ఎ.ఎస్.డి. శాంతి, డి. లక్ష్మణ్ కుమార్, పి. వినీత్, డైరెక్టర్లు కె. శ్రీశైలం, కె. జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తికి 15 రోజుల జైలు శిక్ష

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 31 (పీపుల్స్ న్యూస్) :**



పెట్టీ కేసులో నిందితుడికి హైదరాబాద్ నాంపల్లిలోని ఎ×వ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు శుక్రవారం 15 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. వివరాల ప్రకారం...... రాత్రి పూట గస్తీ నిర్వహిస్తున్న మలక్‌పేట , పల్టాన్ కు చెందిన బదాల లింగప్ప (30) ని చాదర్‌ఘాట్ పోలీసు సిబ్బందికి.. ముఖానికి ముసుగు వేసుకుని, ఏదైనా నేరానికి పాల్పడే దురుద్దేశంతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తి కనిపించాడు. దీంతో పోలీసు బలగాలు వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని, చట్టరీత్యా కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. నాంపల్లి మనోరంజన్ కాంప్లెక్స్‌లోని ఎ×వ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జ్ మేజిస్ట్రేట్ ఎం. భాస్కర్ వాదనలను పరిశీలించి, సిటీ పోలీస్ యాక్ట్ సెక్షన్ 61(ఎ) ప్రకారం నిందితుడు దోషిగా నిర్ధారించబడ్డాడని ప్రకటిస్తూ, అతడికి 15 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ , నేరాల నివారణలో భాగంగా చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రిపూట గస్తీని మరింత తీవ్రతరం చేశామని, అనుమానాస్పదంగా తిరిగే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించడమైనది.

# అక్రమంగా విక్రయిస్తున్న 100 మెఫెంటెర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్ల దందా గుట్టురట్టు

**- ముగ్గురు నిందితుల అరెస్ట్**
**- రూ. 4 లక్షల విలువైన సొత్తు స్వాధీనం**



**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 31 (పీపుల్స్ న్యూస్) :**
అక్రమంగా నిషేధిత మెఫెంటెర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లను నిల్వ ఉంచి, అధిక ధరలకు విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను చార్మినార్ జోన్ కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ బృందం, సైఫాబాద్ పోలీసులతో కలిసి అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుతి లాజిస్టిక్స్ సమీపంలో దాడి చేసి టప్పాచబుత్రా నటరాజ్ నగర్ కు చెందిన షేక్ ఫహీమ్ (31), మొహమ్మద్ నయీమ్ (35), ఇబ్రహీం హుస్సేన్ (22), ఈ నెల 29 న సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హెచ్‌పీ పెట్రోల్ పంప్ గల్లీలో ఉన్న శ్రీ మారుతి లాజిస్టిక్స్ వద్ద ముగ్గురు వ్యక్తులు అక్రమంగా ఇంజెక్షన్లతో తిరుగుతున్నారనే పక్కా సమాచారంతో చార్మినార్ జోన్ టాస్క్‌ఫోర్స్ , సైఫాబాద్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి నిందితులను పట్టుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో, నిందితులు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన శక్తి హుడా అనే వ్యక్తి నుండి ట్రాన్స్‌పోర్ట్ ద్వారా ఈ మెఫెంటెర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లను తెప్పించి, ఇక్కడ అవసరమున్న వారికి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 4 లక్షల విలువైన 100 మెఫెంటెర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్ వైయల్స్, ఒక యమహా ఏరాక్స్ స్కూటీ మరియు 3 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మెఫెంటెర్మైన్ సల్ఫేట్ అనేది వైద్యుల పర్యవేక్షణ లేకుండా వాడితే గుండెపోటు, తీవ్రమైన రక్తపోటు , ఇతర ప్రాణాంతక గుండె సంబంధిత సమస్యలకు దారితీస్తుంది. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా ఈ ఇంజెక్షన్లను వాడటం ఆరోగ్యానికి తీవ్ర హానికరం. యువత మరియు ప్రజలు ఇటువంటి ఉత్ప్రేరకాలు, డ్రగ్స్ , నిషేధిత ఔషధాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ఆపరేషన్‌ను చార్మినార్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ ఎస్. సైదాబాబు పర్యవేక్షణలో సబ్-ఇన్స్‌పెక్టర్లు ఎం. మధు, కె. రామారావు, ఎం. మహేష్, కానిస్టేబుల్ కె. సంతోష్ కుమార్ , చార్మినార్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం, సైఫాబాద్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి సమర్థవంతంగా నిర్వహించారు.

# చింతగుర్తి గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యుల ఎన్నిక

**ఖమ్మం జిల్లా, జూలై 31 (పీపుల్స్ న్యూస్) :** ఖమ్మం జిల్లా రఘునాధపాలెం మండలం, చింతగుర్తి గ్రామం నందు శుక్రవారం చింతగుర్తి గ్రామ కాంగ్రెస్ పార్టీ సభ్యుల సమావేశం గ్రామంలోని పార్టీ సీనియర్ నాయకులు తమ్మినేని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సర్పంచ్ ప్రియాంక అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షులుగా శుదగాని గోపయ్య ని, ఉపాధ్యక్షులుగా జీడిమెట్ల వెంకటరమణ ని. ప్రధాన కార్యదర్శిగా అద్దంకి ముత్తయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు గా సభ్యులను కూడా ఎన్నుకున్నారు. వారిలో పాలల్లి ఉపేందర్, ఆడెపు శ్రీనివాసరావు, సురభి కొండలు ,మాలోతు నరేష్, కుర్ర రామకృష్ణ, పాలేలి నాగేశ్వరరావు, ఆలస్యం లక్ష్మయ్య, దుంపటి వీరబాబు లు కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నుకోబడిన వారిని మండల నాయకులు, గ్రామ కార్యకర్తలు, సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నుకోబడిన వారు గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ అంకితభావంతో పని చేస్తామని తెలియజేశారు.



# ఉద్యమ వీరుడికి గులాబీ కుటుంబం ఘన నివాళి.

**- పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలు చిరస్మరణీయం.**





**జనగామ, జులై 31 (ప్రజా అక్షరం ప్రతినిధి) :**
తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన దివంగత నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి పార్థివ దేహంపై గులాబీ పార్టీ జెండాను కప్పి



అశ్రునయనాలతో అంతిమ నివాళులర్పించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి...

## పదవీ విరమణ ఉద్యోగానికే... పోలీసు విలువలు, సేవాభావానికి కాదు

**మల్కాజ్‌గిరి సీపీ బి. సుమతి**



**మల్కాజ్‌గిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 31 (పీపుల్స్ న్యూస్):** పదవీ విరమణ ఉద్యోగానికే... పోలీసు విలువలు, సేవాభావానికి కాదని మల్కాజ్‌గిరి సీపీ బి. సుమతి అన్నారు. శుక్రవారం పదవీ విరమణ పొందిన 7 మంది పోలీసు అధికారులను సన్మానించి, పోలీసు శాఖకు వారు అందించిన విశిష్ట సేవలను అభినందించారు. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి సీపీ బి. సుమతి మాట్లాడుతూ మీ అనుభవం సమాజానికి ఎల్లప్పుడూ దిక్సూచిగా నిలుస్తుందని సీపీ పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా సమాజ సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

## సమయస్ఫూర్తి... సేవా నిబద్ధత... ప్రాణరక్షణే మా ధ్యేయం!





**మల్కాజ్‌గిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 31 (పీపుల్స్ న్యూస్) :** డయల్-100 సమాచారం అందిన కేవలం నాలుగు నిమిషాల్లో స్పందించి తల్లి, ముగ్గురు చిన్నారుల ప్రాణాలను కాపాడిన చైతన్యపురి పోలీస్ బృందం సేవలను గుర్తిస్తూ మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి తగిన నగదు బహుమతి/రివార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ప్రాణభద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ, మానవత్వంతో సేవలందించడం మల్కాజ్‌గిరి పోలీసుల సేవా తత్పరతకు నిదర్శనమన్నారు.

## రోడ్డు భద్రత అంశాలపై విద్యార్థులకు అవగాహన



**మల్కాజ్‌గిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 31 (పీపుల్స్ న్యూస్):** ఉప్పల్ లోని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల నివారణ, సైబర్ భద్రత, మీ-సురక్ష, రోడ్డు భద్రత అంశాలపై ఉప్పల్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఏసీపీ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎస్ హెచ్ఓ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో జూలై 31 (పీపుల్స్ న్యూస్)**
ఆగస్టు 2వ తేది నుంచి 4 వ తేది వరకు సికింద్రాబాద్ లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర పూర్తయ్యే వరకు వైభవంగా జరగనుంది. ఈ సందర్భంగా ఆలయానికి తరలివచ్చే అపార భక్తజనం, వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయం చుట్టూ 2 కిలోమీటర్ల పరిధిలో ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేయనున్నట్లు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ విభాగం వెల్లడించింది. ప్రయాణికులు తమ ప్రయాణాన్ని ముందస్తుగా ప్లాన్ చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే కూడళ్లు కర్బాలా మైదాన్, రాణిగంజ్, ఓల్డ్ పి.ఎస్. రాంగోపాల్‌పేట్, ప్యారడైజ్, సీటీఓ, ప్లాజా, ఎస్‌బీఐ క్రాస్ రోడ్స్, వైఎంసీఏ క్రాస్ రోడ్స్, సెయింట్ జాన్స్ రోటరీ, సంగీత్ క్రాస్ రోడ్స్, ప్యాట్నీ క్రాస్ రోడ్స్, పార్క్ లేన్, బాటా, ఘాస్‌మండి క్రాస్ రోడ్స్, బైబిల్ హౌస్, మినిస్టర్స్ రోడ్, రసూల్‌పురా.

పూర్తిగా మూసివేసే రహదారులు:
ఆగస్టు 01, 02 వ తేది అర్ధరాత్రి 00:00 గంటల నుండి 04 ఉదయం 03:00 గంటల వరకు (జాతర పూర్తయ్యే వరకు) పొగాకు బజార్ , హమాలీ విగ్రహం నుండి మహంకాళి ఆలయానికి వెళ్లే రహదారులు.సుభాష్ రోడ్ (బాటా క్రాస్ రోడ్స్ నుండి రోచా బజార్ వరకు).హిల్ స్ట్రీట్, అడవియ్య క్రాస్ రోడ్స్ నుండి మహంకాళి ఆలయానికి వెళ్లే రహదారి, జనరల్ బజార్ నుండి మహంకాళి ఆలయానికి వెళ్లే రహదారులలో సాధారణ వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిపివేయబడతాయి

ప్రధాన ట్రాఫిక్ మళ్లింపు పాయింట్లు:
1. ప్యాట్నీ క్రాస్ రోడ్స్, ఎస్‌బీఐ క్రాస్ రోడ్స్, ప్యారడైజ్ నుండి ట్యాంక్‌బండ్ వైపు వెళ్లే వాహనాలు: ప్యాట్నీ వద్ద ప్యారడైజ్, మినిస్టర్ రోడ్ లేదా క్లాక్ టవర్, సంగీత్ క్రాస్ రోడ్స్ -- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, చిలకలగూడ, ముషీరాబాద్ క్రాస్ రోడ్స్ -- కవడిగూడ -- మారియాట్ హోటల్ -- ట్యాంక్‌బండ్ వైపు మళ్లిస్తారు.ప్యారడైజ్ నుండి బైబిల్ హౌస్ వైపు వెళ్లే వాహనాలు: ప్యాట్నీ క్రాస్ రోడ్స్ వద్ద ఎస్‌బీఐ లేదా క్లాక్ టవర్ వైపు మళ్లిస్తారు.క్లాక్ టవర్ నుండి ఆర్.పి. రోడ్ వైపు వెళ్లే వాహనాలు: ప్యాట్నీ వద్ద ఎస్‌బీఐ క్రాస్ రోడ్స్ లేదా ప్యారడైజ్, మినిస్టర్ రోడ్, రసూల్‌పురా, రాణిగంజ్, ట్యాంక్‌బండ్ వైపు మళ్లిస్తారు. ఘాస్‌మండి క్రాస్ రోడ్స్: బైబిల్ హౌస్ నుండి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, తిరుమలగిరి వైపు వెళ్లే వాహనాలు: ఘాస్‌మండి వద్ద సజ్జన్‌లాల్ స్ట్రీట్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లేదా హిల్ స్ట్రీట్, రాణిగంజ్ వైపు మళ్లిస్తారు. బైబిల్ హౌస్ క్రాస్ రోడ్స్:జబ్బార్ కాంప్లెక్స్, బన్సీలాల్‌పేట్ నుండి వచ్చే వాహనాలు (భారీ వాహనాలతో సహా): బైబిల్ హౌస్ క్రాస్ రోడ్స్ వద్ద కర్బాలా, రాణిగంజ్ వైపు మళ్లిస్తారు.కర్బాలా క్రాస్ రోడ్స్:
చిల్డ్రన్స్ పార్క్, బైబిల్ హౌస్ నుండి వచ్చే వాహనాలు: కర్బాలా క్రాస్ రోడ్స్ వద్ద రాణిగంజ్ క్రాస్ రోడ్స్ వైపు మళ్లిస్తారు. రాణిగంజ్ క్రాస్ రోడ్స్ (సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వైపు):కర్బాలా మైదాన్ నుండి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు , సాధారణ వాహనాలు: రాణిగంజ్ క్రాస్ రోడ్స్ వద్ద మినిస్టర్ రోడ్ -- రసూల్‌పురా క్రాస్ రోడ్స్ -- ఎడమ మలుపు -- పి.ఎన్.టి ఫ్లైఓవర్ -- హెచ్.పి.ఎస్ యు-టర్న్ -- సీటీఓ -- ఎస్‌బీఐ క్రాస్ రోడ్స్ -- వైఎంసీఏ -- సెయింట్ జాన్స్ రోటరీ -- సంగీత్ -- గోపాలపురం లైన్ మీదుగా రైల్వే స్టేషన్‌కు వెళ్లాలి.రైల్వే స్టేషన్ నుండి ట్యాంక్‌బండ్ వైపు తిరిగి వెళ్లే ఆర్టీసీ బస్సులు: చిలకలగూడ క్రాస్ రోడ్స్, గాంధీ హాస్పిటల్ -- ముషీరాబాద్ క్రాస్ రోడ్స్ -- కవడిగూడ -- మారియట్ హోటల్ -- ట్యాంక్‌బండ్ మీదుగా వెళ్లాయి. రైల్వే స్టేషన్ నుండి తాడ్‌బన్, బేగంపేట్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు: క్లాక్ టవర్ -- ప్యాట్నీ క్రాస్ రోడ్స్/వైఎంసీఏ -- ఎస్‌బీఐ క్రాస్ రోడ్స్ మీదుగా వెళ్తాయి. ప్యారడైజ్ క్రాస్ రోడ్స్: సీటీఓ జంక్షన్ నుండి ఎమ్.జి. రోడ్ వైపు వెళ్లే వాహనాలు: ప్యారడైజ్ వద్ద సింధీ కాలనీ -- కుడి మలుపు -- మినిస్టర్ రోడ్ -- ఎడమ మలుపు -- రాణిగంజ్ క్రాస్ రోడ్స్ -- కుడి మలుపు -- కర్బాలా మైదాన్ వైపు మళ్లిస్తారు.ప్యాట్నీ క్రాస్ రోడ్స్ నుండి వచ్చే వాహనాలు: ప్యారడైజ్ వద్ద సీటీఓ జంక్షన్ వైపు మళ్లిస్తారు.

భక్తుల వాహనాల పార్కింగ్ స్థలాలు:
సెయింట్ జాన్స్ రోటరీ, మారేడుపల్లి, ఎస్‌బీఐ వైపు నుండి వచ్చే వాహనాలు: హరిహర కళాభవన్‌లో పార్కింగ్ చేయాలి. (కెపాసిటీ: 2-వీలర్స్: 200, 4-వీలర్స్: 50) ఎస్.డి. రోడ్ నుండి మంజు థియేటర్ లైన్ వైపు వచ్చే వాహనాలు: యశోద పార్కింగ్ (రామ్‌సింగ్ అగర్వాల్ పైన్స్ పక్కన) పార్కింగ్ చేయాలి. (కెపాసిటీ: 2-వీలర్స్: 200, 4-వీలర్స్: 50), సంగీత్ సిగ్నల్, క్లాక్ టవర్ వైపు నుండి వచ్చే వాహనాలు: మహబూబ్ కాలేజీలో పార్కింగ్ చేయాలి. (కెపాసిటీ: 2-వీలర్స్: 300, 4-వీలర్స్: 100), సెయింట్ జాన్స్ రోటరీ, స్వీకార్ ఉపకార్, ఎస్‌బీహెచ్ వైపు నుండి వచ్చే వాహనాలు: సీఎమ్‌ఆర్ షాపింగ్ మాల్ పార్కింగ్ స్థలంలో పార్కింగ్ చేయాలి. (కెపాసిటీ: 2-వీలర్స్: 1000, 4-వీలర్స్: 200), రైల్వే స్టేషన్ వైపు నుండి వచ్చే వాహనాలు: ఓల్డ్ జైలు ఖానా ఖాళీ స్థలంలో (కల్వతరు జ్యువెలర్స్ ఎదురుగా, స్టేషన్ రోడ్) పార్కింగ్ చేయాలి. (కెపాసిటీ: 2-వీలర్స్: 200, 4-వీలర్స్: 40), భోయిగూడ, గాంధీనగర్, బైబిల్ హౌస్, ఘాస్‌మండి వైపు నుండి వచ్చే వాహనాలు: ఇస్లామియా హైస్కూల్ (కూరగాయల మార్కెట్ దగ్గర, ఘాస్‌మండి రోడ్) లో పార్కింగ్ చేయాలి. (కెపాసిటీ: 2-వీలర్స్: 60, 4-వీలర్స్: 20), రాణిగంజ్ ఒ అడవియ్య క్రాస్ రోడ్స్ నుండి వచ్చే వాహనాలు: ప్రభుత్వ అడవియ్య మెమోరియల్ హైస్కూల్ (అడవియ్య క్రాస్ రోడ్స్, రాణిగంజ్) లో పార్కింగ్ చేయాలి. (కెపాసిటీ: 2-వీలర్స్: 60, 4-వీలర్స్: 20), నల్లగుట్ట, బేగంపేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్ వైపు నుండి వచ్చే వాహనాలు: నల్లగుట్ట జీహెచ్ఎమ్‌సీ గ్రౌండ్ (చుట్టలబస్తీ) లో పార్కింగ్ చేయాలి. (కెపాసిటీ: 2-వీలర్స్: 150, 4-వీలర్స్: 20), బిబిపి వాహనాలు: మహాత్మా గాంధీ విగ్రహం, ఎమ్.జి. రోడ్ వద్ద పార్కింగ్ చేయాలి. (కెపాసిటీ: 2-వీలర్స్: 200, 4-వీలర్స్: 50), రాణిగంజ్ నుండి రోచా బజార్ వైపు వచ్చే వాహనాలు: పాట్నీ టెంపుల్ (చెర్మాస్ పక్కన, ఎమ్.జి. రోడ్) వద్ద పార్కింగ్ చేయాలి. (కెపాసిటీ: 2-వీలర్స్: 200, 4-వీలర్స్: 50), నల్లగుట్ట, బేగంపేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్ వైపు నుండి వచ్చే వాహనాలు: వెస్లీ కాలేజ్ పార్కింగ్ స్థలం / జీహెచ్ఎమ్‌సీ గ్రౌండ్, చుట్టలబస్తీలో పార్కింగ్ చేయాలి. (కెపాసిటీ: 2-వీలర్స్: 300, 4-వీలర్స్: 150),బేగంపేట్ ఒ జేబీఎస్ వైపు నుండి వచ్చే వాహనాలు: జింఖానా గ్రౌండ్ పార్కింగ్ (బేగంపేట్) లో పార్కింగ్ చేయాలి. (కెపాసిటీ: 2-వీలర్స్: 150, 4-వీలర్స్: 20), బేగంపేట్, రసూల్‌పురా, పట్టిగడ్డ వైపు నుండి వచ్చే వాహనాలు: స్వప్నలోక్ కాంప్లెక్స్ పార్కింగ్ స్థలంలో పార్కింగ్ చేయాలి. (కెపాసిటీ: 2-వీలర్స్: 500, 4-వీలర్స్: 125), సెయింట్ జాన్స్ రోటరీ, స్వీకార్ ఉపకార్, ఎస్‌బీఐ వైపు నుండి వచ్చే వాహనాలు: తాజ్ త్రిస్టార్ లైన్‌లో పార్కింగ్ చేయాలి. (కెపాసిటీ: 2-వీలర్స్: 100, 4-వీలర్స్: 20) నగరవాసులు , ప్రయాణికులు తమ ప్రయాణాన్ని ముందస్తుగా సమాయత్తం చేసుకోవాలని విజ్ఞప్తి చేయడమైనది. ప్రయాణ సమయంలో ఏవైనా అత్యవసర పరిస్థితులు ఎదురైతే, సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626 కు కాల్ చేయవచ్చు. అలాగే హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ అధికారిక సోషల్ మీడియా పేజీలు (ఫేస్‌బుక్: ఎక్స్(ట్విట్టర్: ఎక్స్(గూ) ద్వారా తాజా ట్రాఫిక్ సమాచారాన్ని తెలుసుకుంటూ, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు సహకరించాల్సిందిగా కోరారు.




## అధిక తీవ్రత గల కాంతి పరికరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదు

**- రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో లేజర్ బీమ్, స్కై బీమ్ లైట్ల వినియోగంపై అవగాహన సమావేశం**



**హైదరాబాద్ కమిషనరేట్,క్రైమ్ బ్యూరో జూలై 31 (పీపుల్స్ న్యూస్) :** రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో విమానాల సురక్షిత రాకపోకలకు విఘాతం కలిగించే లేజర్ బీమ్ లైట్లు, స్కై బీమ్ లైట్లు, సెర్చ్ లైట్లు, మూవింగ్ బీమ్ లైట్లు , ఇతర అధిక తీవ్రత గల కాంతి పరికరాల వినియోగాన్ని నిషేధిస్తూ, గురువారం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయం, శంషాబాద్ నందు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హైదరాబాద్ అదనపు పోలీసు కమిషనర్ (లా అండ్ ఆర్డర్) తఫ్సీర్ ఇక్బాల్ అధ్యక్షత వహించగా, శంషాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ బి. రాజేష్, ఆదిభట్ల సహాయ పోలీసు కమిషనర్ ప్రదీప్ రెడ్డి, శంషాబాద్ సహాయ పోలీస్ కమిషనర్ వి. శ్రీకాంత్ గౌడ్, , జీఎంఆర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జీఎంఆర్ ఎయిర్‌సైడ్ భద్రతా విభాగ అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లోని సుమారు 70 కన్వెన్షన్ హాళ్లు, ఫంక్షన్ హాళ్లు, బ్యాంక్వెట్ హాళ్లు, ఫామ్ హౌస్‌ల యజమానులు, నిర్వాహకులు హాజరై విమాన భద్రతకు సంబంధించిన నిబంధనలపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆకాశం వైపు ప్రసరించే లేజర్ బీమ్ లైట్లు, స్కై బీమ్ లైట్లు, సెర్చ్ లైట్లు, మూవింగ్ బీమ్ లైట్లు , ఇతర అధిక తీవ్రత గల కాంతి పరికరాలు విమాన పోలకుల దృష్టిని మరల్చడంతో పాటు తీవ్ర కాంతి ప్రతిఫలన కు కారణమై, విమానాల టేకాఫ్, అప్రోచ్ మరియు ల్యాండింగ్ ప్రక్రియలకు అంతరాయం కలిగించి, విమాన భద్రతకు తీవ్రమైన ముప్పును కలిగించే అవకాశం ఉన్నదని వివరించారు. లేజర్ బీమ్ లైట్లు,స్కై బీమ్ లైట్లు, సెర్చ్ లైట్లు, మూవింగ్ బీమ్ లైట్లు లేదా ఆకాశం వైపు ప్రసరించే ఇతర అధిక తీవ్రత గల కాంతి పరికరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదని, తమ ప్రాంగణాల్లో ఏర్పాటు చేసే లైటింగ్ వ్యవస్థలు విమానాల రాకపోకలకు ఎటువంటి ఆటంకం కలిగించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ నిబంధనలను ఈవెంట్ నిర్వాహకులు, డెకరేటర్లు, డీజేలు, లైటింగ్ కాంట్రాక్టర్లకు తప్పనిసరిగా తెలియజేశారు. పోలీసు శాఖ, విమానాశ్రయ అధికారులు, సీఐఎస్ఎఫ్, డీజీసీఏ లేదా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) ఆదేశించిన వెంటనే ఇటువంటి కాంతి పరికరాల వినియోగాన్ని నిలిపివేయాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్, 1937లోని రూల్-66, డీజీసీఏ సివిల్ ఏవియేషన్ రిక్వైర్మెంట్స్ (సీఏఆర్), సెక్షన్-4 (ఏరోడ్రోమ్స్), సిరీస్-బి, పార్ట్-X, పేరా-5.3.1.2, అలాగే భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), 2023లోని సెక్షన్లు 125, 223 మరియు 283తో పాటు వర్తించే ఇతర చట్టాల ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. విమాన భద్రత దృష్ట్యా రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లోని కన్వెన్షన్ హాళ్లు, ఫంక్షన్ హాళ్లు, బ్యాంక్వెట్ హాళ్లు, రిసార్ట్లు, ఫామ్ హౌస్‌లు, ఈవెంట్ నిర్వాహకులు, డెకరేటర్లు, డీజేలు, లైటింగ్ కాంట్రాక్టర్లు అం దరూ ఈ నిబంధనలను విధిగా పాటించి, సురక్షిత విమాన రాకపోకలకు తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## 52 వ డివిజన్ లో ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం



**రామగుండం,జూలై 31 (ప్రజా అక్షరం ప్రతినిధి):-** గోదావరిఖని పట్టణంలోని స్థానిక కళ్యాణ్ నగర్ లోని 52 వ డివిజన్ రాజస్థాన్ భవన్ లో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని ఆధ్వర్యంలో, కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి ఆపరేషన్ శిబిరాన్ని ఏర్పాటు చేసి దాదాపు72 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 38 మందిని కంటి ఆపరేషన్ అవసరం ఉన్నవారిని గుర్తించి వారిని బస్సులో రేకుర్తి కంటి ఆసుపత్రికి పంపించడం జరిగింది.ఈ కార్యక్రమంలో 52వ డివిజన్ కార్పొరేటర్ చిదురాల నాగరాజు, క్లబ్ అధ్యక్షులు చిట్టిమల కిషోర్, సెక్రెటరీ అల్లాడి నాగరాజు, ట్రెజరర్ చింతకింది కృష్ణలీయో టు లైన్ కోఆర్డినేటర్ నార్ల ప్రసాద్,జోన్ చైర్మన్ కొమరవెల్లి సుధాకర్, లక్ష్మీవాణి,లైన్స్ క్లబ్ ఆఫ్ లక్ష్మీ నగర్ అధ్యక్షులు అనఘాలే కృష్ణమూర్తి,డీసీ విజన్ కోఆర్డినేటర్ చందర్ గుప్తా,డీసీ ఐ క్యాంప్స్ స్క్రీనింగ్ కోఆర్డినేటర్ మామిడిపల్లి శ్రీధర్,లైన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి అధ్యక్షులు కోదాటి ప్రవీణ్, లైన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని వాసవి అధ్యక్షులు కొమరవెల్లి రాహుల్ తో పాటు,లైన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని సభ్యులు పాల్గొన్నారు.

# ప్రాణాలు తోడేస్తున్న నిర్లక్ష్యం.. పాలకులకు పట్టింపు లేదా?

**- పాలకుల నిర్లక్ష్యానికి, అధికారుల అలసత్వానికి అమాయక ప్రాణాలు బలవుతున్నాయి**

**- గల్లంతైన వ్యక్తి ఆచూకీ కనుగొనడంలో ప్రజాప్రతినిదులు, ప్రభుత్వ యంత్రాంగం ఘోర వైఫల్యం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు**









**శేరిలింగంపల్లి,జూలై 31 (పీపుల్స్ న్యూస్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పాలకుల నిర్లక్ష్యానికి, అధికారుల అలసత్వానికి అమాయక ప్రాణాలు బలవుతున్నాయని శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె తో పాటు అల్లఉద్దీన్ పటేల్, మిద్దెల మల్లారెడ్డి,పొట్ట నరేందర్ యదవ్,విజయ్ కుమార్ రెడ్డి,సంగారెడ్డి,జనార్ధన్ గౌడ్ లు పాల్గొని మాట్లాడారు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమనగర్ రైల్వే అండర్‌పాస్ వద్ద ఉన్న ప్రమాదకరమైన నాలాలో పడి గల్లంతైన వృద్ధుడు బాలయ్య (70) ఆచూకీ ఇంతవరకు లభించకపోవడం ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యానికి నిదర్శనమని వారు విమర్శించారు. పాలకుల నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టారు. నియోజకవర్గంలో ప్రతి వర్షాకాలం ప్రజలకు ప్రాణసంకటంగా మారుతోందని, మ్యాన్‌హోళ్లు, తెరిచి ఉన్న నాలాల వద్ద కనీస రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయన్నారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగి, రక్షణ లేక ఒక్కొక్కరుగా ప్రాణాలు కోల్పోయిన విషాదాలు కళ్లముందే ఉన్నప్పటికీ.. స్థానిక ప్రజాప్రతినిధులకు,అధికారులకు కనీసం చీమ కుట్టినట్లయినా లేదన్నారు. గతం నుంచి గుణపాఠం నేర్చుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, ఆ దిశగా కనీస ప్రయత్నం చేయడం లేదని వారు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

ప్రకటనలే తప్ప పనులు లేవు..అబాలయ్య గల్లంతైన తర్వాత అధికారులు,ప్రజాప్రతినిధులు, ఘటనా స్థలానికి వచ్చి.. జీహెచ్ఎంసీ, పోలీసు, ఎన్డీఆర్ఎఫ్, హైడ్రా తదితర శాఖల అధికారులతో కలిసి గాలింపు చర్యలు ముమ్మరం చేశామని చెబుతున్న మాటలు కేవలం తూతూ మంత్రంగా మిగిలిపోతున్నాయని వారు ఎద్దేవా చేశారు. ఇంత ప్రభుత్వ యంత్రాంగం ఉండి, ఆధునిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నా.. గల్లంతైన ఒక మనిషి ఆచూకీని 4 రోజులుగా కనుగొనలేని దయనీయ స్థితిలో ప్రభుత్వం, అధికారులు, ఎమ్మెల్యే ఉండటం సిగ్గుచేటన్నారు. ఎప్పుడూ ప్రమాదాలు జరిగిన వెంటనే నాలాల వెంట రెయిలింగ్ ఏర్పాటు చేస్తామని, భద్రతా చర్యలు తీసుకుంటామని ప్రగల్భాలు పలికే ప్రజాప్రతినిధులు.. ఆచరణలో మాత్రం చేతులెత్తేస్తున్నారని దుయ్యబట్టారు.కేవలం ప్రాణాలు పోయినప్పుడు మొక్కుబడిగా పరామర్శించి, ఫొటోలకు ఫోజులిచ్చి వెళ్లే సంస్కృతికి ప్రజాప్రతినిధులు, స్వస్తి పలకాలని హితవు పలికారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు నిద్రమత్తు వీడి తక్షణమే బాలయ్య ఆచూకీ కనుగొనాలని, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో నాలాలు, మ్యాన్‌హోళ్ల వల్ల ఇలాంటి ప్రాణనష్టం జరగకుండా తక్షణమే కట్టుదిట్టమైన శాశ్వత చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎం.డీ. సలీం,శ్రీనివాస్ రెడ్డి,రాములు,చారి, చందర్ రావు, శభన,అంజి యాదవ్,అనంత రెడ్డి, రాజశేఖర్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# మాలల స్థానం ఎక్కడ...?

**-మాలలపై చిన్నచూపు చూపిస్తున్న ఎమ్మెల్యే**


**-కూచిమల్ల నాగేష్, మాలమహానాడు మండల అధ్యక్షులు**




**వలిగొండ జూలై 31** వలిగొండ మండలంలోని మాలలకు అన్ని రకాలుగా అన్యాయం జరుగుతుందని మాల మహానాడు మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్ విలేకరుల సమావేశంలో ఒక ప్రకటన విడుదల చేసి ఆవేదన వ్యక్తం చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండల పిఏసిఎస్ నూతన పాలకవర్గాన్ని, మండల పరిధిలోని వెంకటపురం గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొని ఇటీవల ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. పిఏసిఎస్ పాలకవర్గంలో, శ్రీమత్స్యగిరిలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పాలకవర్గంలో మాల కులస్తులకు అవకాశం కల్పించలేదని, ఇదంతా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కనుసైగల్లోనే జరిగిందని ఆయన అన్నారు. ఎలక్షన్లలో మాలల ఓటు బ్యాంక్ కావాలి కానీ మాలలకు పదవులలో సముచిత స్థానం కల్పించడంలో మీరెందుకు వివక్ష చూపిస్తున్నారో ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి వలిగొండ మండల మాలలకు సమాధానం చెప్పాలన్నారు. ఆనాడు మీ గెలుపు కోసం ముందుండి పనిచేసిన మాలలకు నేడు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఎలా ఊరుకుంటారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మండల నాయకులైనా మాపై ఆలోచన చేయలేదంటే మాలలపై ఇంత కక్ష ఎందుకో చెప్పాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముందు ముందు వివక్ష లేకుండా మాలలకు సముచిత స్థానం కల్పించి గౌరవించాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు.

# నకిలీ నంబర్ ప్లేట్లపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల కఠిన చర్యలు

**- ప్రత్యేక తనిఖీలు తీవ్రతరం**



ORIGINAL VEHICLE No.TS19A9821 (HF-DELUXE) | FAKE VEHCILE No.TS19A9821 (HF-DELUXE) ACTUAL VEHICLE NO.TO BE ASCERTAINED



ORIGINAL VEHICLE No.TS12EP9264 (HONDA-ACTIVA) | FAKE VEHCILE No.TS12EP9264 (HONDA-ACTIVA) ACTUAL VEHICLE NO. TO BE ASCERTAINED



ORIGINAL VEHICLE No.TS12EF8720 (HONDA-ACTIVA) | FAKE VEHCILE No.TS12EF8720 (HONDA-ACTIVA) ACTUAL VEHICLE No.TS12EF8726



ORIGINAL VEHICLE No.TS12EM6888 (HONDA-ACTIVA) | FAKE VEHCILE No.TS12EM6888 (HONDA-ACTIVA) ACTUAL VEHICLE No.TS08ANTR5262



ORIGINAL VEHICLE No.TS07FQ6786 (FORD-ECOSPORT) | FAKE VEHCILE No.TS07FQ6786 (FORD-ECOSPORT) ACTUAL VEHICLE NO. TO BE ASCERTAINED



**హైదరాబాద్ కమిషనరేట్,క్రైమ్ బ్యూరో జూలై 31 (పీపుల్స్ న్యూస్) :** వాహనాలకు నకిలీ, ట్యాంపరింగ్ చేసిన అనుమతి లేని రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లను ఉపయోగిస్తున్న వారిపై ఫిర్యాదులు పెరగడంతో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలను తీవ్రతరం చేశారు. మోటారు వాహనాల చట్టం , ఇతర చట్టపరమైన నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రత్యేక చర్యల్లో భాగంగా, వాహనాల గుర్తింపును దాచడం, చలానాల నుండి తప్పించుకోవడం , ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించడం వంటి అక్రమాలకు పాల్పడిన వారిపై గత వారంలో ఆరు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. తనిఖీల సమయంలో పలు వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ నంబర్ ప్లేట్ టీఎస్ 12ఈఎఫ్ 8720 (యాక్టివా) / టీఎస్ 12ఈఎఫ్ 8726 (యాక్టివా) ఉపయోగిస్తున్న , ఆసిఫ్‌నగర్, మహబూబ్ కాలనీకి చెందిన ఫరహత్ బేగం పై కేసు నమోదు చేశారు. అదే విధంగా మెహదీపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ నంబర్ ప్లేట్ టీఎస్12ఈపీ 9264 (యాక్టివా) ఉపయోగిస్తున్న మాసబ్ ట్యాంక్ కు చెందిన మీర్ ముజాహెద్ అలీ , మహమ్మద్ అబ్బాస్ లపై కేసు నమోదు చేశారు. బహదూర్ పురా పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ నంబర్ ప్లేట్ టీఎస్ 12 ఈఎం 6888 (యాక్టివా) / టీఎస్ 08ఏఎన్టీఆర్ 522 (యాక్టివా) ఉపయోగిస్తున్న చిరాగ్ అలీ నగర్, కిషన్‌బాగ్ కు చెందిన జాకర్ జిలానీ పై కేసు నమోదు చేశారు. పెద్దపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో (రామగుండం) నకిలీ నంబర్ ప్లేట్ టీఎస్ 19ఏ9821 (హెచ్ఎఫ్ డిలక్స్) ఉపయోగిస్తున్న కొత్తంవాడ, పెద్దపల్లి కి చెందిన ఎన్. వీరేశం పై కేసు నమోదు చేశారు. మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ నంబర్ ప్లేట్ టీఎస్ 07ఎఫ్క్యూ 6786 (ఫోర్డ్ ఎకోస్పోర్ట్) ఉపయోగిస్తున్న మారుతి నగర్, మేడిపల్లి కి చెందిన కే. వెంకట్ రెడ్డి పై కేసు నమోదు చేశారు. నల్గొండ జిల్లా కట్టంగూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ నంబర్ ప్లేట్ టీఎస్ 05ఈపీ 1447 (పల్సర్) ఉపయోగిస్తున్న నకిరేకల్ కు చెందిన కరింగు శ్రీను పై కేసు నమోదు చేశారు. ప్రభుత్వం ఆమోదించిన హై-సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు మాత్రమే చట్టబద్ధంగా అనుమతించబడతాయి. నంబర్ ప్లేట్లను మార్చడం, అంకెలు సరిగ్గా కనిపించకుండా చేయడం లేదా తాత్కాలిక స్టిక్కర్లు వేయడం పూర్తిగా చట్టవిరుద్ధమన్నారు. నకిలీ రిజిస్ట్రేషన్ ప్లేట్లను ఉపయోగించే వారి పట్ల హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంబిస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించి నకిలీ లేదా ట్యాంపరింగ్ చేసిన నంబర్ ప్లేట్లను ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను వెంటనే సీజ్ చేస్తామని పౌరులను తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.వాహన యజమానులందరూ నిర్దేశించిన నంబర్ ప్లేట్ నిబంధనలు మరియు ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని పోలీస్ శాఖ విజ్ఞప్తి చేస్తోంది. ప్రజల భద్రత, సురక్షిత ప్రయాణం , నేరాల నివారణ లక్ష్యంగా ఈ తనిఖీలు నగరం నలుమూలలా నిరంతరాయంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత



**తుర్కపల్లి ,జూలై 31** తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామానికి చెందిన నాగయ్య పెల్లి నరసమ్మ ఇటీవల మరణించడంతో ఆమె కుటుంబానికి బొత్త ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ బొత్త రాములు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జింకల ఎల్లేష్ యాదవ్, ఉపసర్పంచ్ గుమ్మడి బాలరాజు ,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గజం వంశీ, వార్డు సభ్యులు జక్కుల శ్రీశైలం ,జూపల్లి తిరుపతి, ఆలేటి శ్రీశైలం, నాగాయపల్లి శంకర్ పాల్గొన్నారు.

# పెండెం నరసింహులు మృతి పార్టీకి తీరని లోటు

**తుర్కపల్లి ,జూలై 31** తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్



నాయకుడు పెండెం నరసింహులు మృతి చెందడం పార్టీకి తీవ్రలోటని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పెండెం నరసింహులు భౌతిక గాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు అంకితభావంతో పనిచేసిన నిబద్ధత కలిగిన నాయకుడని వారి మరణం భారతీయ జనతా పార్టీకి తీరని లోటని అన్నారు . వారి సేవలు పార్టీ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని, భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనో ధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్, జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మీనారాయణ గౌడ్ జిల్లా మీడియా కో కన్వీనర్ బానోతు శంకర్ నాయక్, సీనియర్ నాయకులు యాట పెంటయ్య, కందుకూరి చిన్న చలమయ్య,బానోతు శత్రు నాయక్, రాష్ట్ర గిరిజన మోర్చా అధికార ప్రతినిధి బానోతు నరేంద్రనాయక్, రాష్ట్ర మైనార్టీ మోర్చా కార్యవర్గ సభ్యులు చాంద్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల రమేష్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బొల్లు నరసింహ యాదవ్, జిల్లా యువ మోర్చా కార్యదర్శి మేకల పాండు యాదవ్, పాముల రామచంద్రం ,గొల్ల రామచంద్రం, గుండెబోయిన మల్లేశం, చిలుకూరి రమేష్, బూత్ అధ్యక్షుడు మల్లేశం కానుగంటి భాను ,తదితరులు పాల్గొన్నారు

# రుద్ర సముద్రంలో వాసవి, వనిత క్లబ్ సేవా కార్యక్రమం

**- జోన్ చైర్మన్ బెండే సత్యవతి విజిట్ సందర్భంగా విద్యార్థులకు క్రీడా సామాగ్రి పంపిణీ**

**- మన్నాని అంపయ్య గారి జ్ఞాపకార్థం 190 ప్లేట్లు అందజేత**

**-- దాత మనసాని నాగరాజును ఘనంగా సత్కరించిన వాసవి, వనిత క్లబ్ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు**

**- రుద్ర సముద్రం మండల పాఠశాలలో వాసవి వనిత క్లబ్ సేవా శిబిరం**



**నారాయణపేట, జూలై 31 (ప్రజా అక్షరం ప్రతినిధి)** రుద్ర సముద్రం గ్రామంలో వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో శు క్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో జోన్ చైర్మన్ విజిట్ సందర్భంగా సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెండే సత్యవతి గారు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు కల్వాల ప్రసన్న కిషోర్ కుమార్ గారి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కీర్తిశేషులు మన్నాని అంపయ్య గారి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల తరఫున 190 ప్లేట్లు అందజేయడం జరిగింది. అలాగే దాతల సహకారంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు క్రీడా సామాగ్రిని కూడా పంపిణీ చేశారు. విద్యార్థుల ప్రోత్సాహం, గ్రామ సేవ, సామాజిక అనుబంధం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించబడినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఇట్టి కార్యక్రమానికి అతిథిగా దాతగా విచ్చేసినటువంటి మనసాని నాగరాజును ఆ వెంకటేశ్వర స్వామి యొక్క చిత్రపటాన్ని అందిస్తూ శాలువతో వాసవి, వనిత క్లబ్ కమిటీ సభ్యులు, స్థానిక సర్పంచ్ గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ సేవా కార్యక్రమంలో దాతగా, అతిథిగా ఎఅ 4లిఖజ+ఖీ మన్నాని నాగరాజు హాజరుకాగా, ప్రధాన కార్యదర్శి కౌకుంట్ల నందిని , మాజీ అధ్యక్షురాలు పాలుట్ల సుష్మ , రుద్ర సముద్రం గ్రామ సర్పంచ్ , ఉప సర్పంచ్ , పంచాయతీ సెక్రెటరీ , గ్రామ ప్రజాప్రతినిధులు, క్లబ్ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. స్థానికుల హర్షం...గ్రామంలో సేవాభావాన్ని పెంపొందించే విధంగా, విద్యార్థులకు ఉత్సాహాన్ని అందించేలా ఈ కార్యక్రమం నిర్వహించబడటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు తరచూ జరగాలని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

# బద్రీనాథ్‌లో నారాయణుడిని లక్ష్మీదేవి ఎలా రక్షించింది? ఆరు నెలల పాటు వెలిగే అఖండ దీప రహస్యమిదే!






బద్రీనాథ్ ధామం భారత్‌లోని ఉత్తరాఖండ్ రాష్ట్రంలో అలకనంద నది ఒడ్డున గల అత్యంత ప్రసిద్ధ వైష్ణవ దివ్యక్షేత్రం. ఇది హిందువుల పవిత్రమైన చార్ ధామ్ యాత్రలో ఒకటిగాను, 108 శ్రీ వైష్ణవ దివ్య దేశాలలో ఒకటిగాను ప్రసిద్ధి చెందింది. ఇక్కడ శ్రీ మహావిష్ణువు బద్రీనాథుడుగా పూజలందుకుంటున్నాడు. ఈ పవిత్ర క్షేత్రంలో శ్రీ మహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్లే తొలి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా జరుపుతారు. ఈ సందర్భంగా బద్రీనాథ్ క్షేత్ర విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం.బదరి వృక్షంగా నారాయణుని రక్షించిన లక్ష్మీదేవిపవిత్ర హిమాలయ పర్వత సానువుల్లో కొలువై ఉన్న శ్రీ బద్రీనాథ్ ధామం సనాతన ధర్మంలోని అత్యంత పవిత్రమైన తీర్థ క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతోంది. నరనారాయణులు తపస్సు చేసిన ఈ పవిత్ర క్షేత్రంలో నారాయణుడు ఇక్కడ అధిష్టాన దైవంగా భగవాన్ బద్రీ విశాల్ గా వెలసి ఉన్నాడు. బద్రీనాథ్?లో అతి శీతల వాతావరణంలో నారాయణుడు కఠోర తపస్సులో లీనమై ఉన్నప్పుడు, లక్ష్మీదేవి మంచు నుంచి రక్షించడానికి బదరి అంటే రేగు వృక్ష రూపాన్ని ధరించిందని పురాణాలు చెబుతున్నాయి. ఈ కారణంగానే ఈ ప్రదేశానికి బదరీనాథ్ అనే పేరు వచ్చింది. ఇక్కడ వెలసిన నారాయణుడు బద్రీ విశాల్ గా ప్రసిద్ధి చెందాడు.ఆలయ విశేషాలుబద్రీనాథ్ క్షేత్రంలో 8వ శతాబ్దంలో ఆది శంకరాచార్యులు ప్రతిష్టించారు. ఇక్కడ కొలువై ఉన్న విగ్రహం సాలగ్రామంతో తయారు చేయబడి ఉంటుంది. ఈ నారాయణుని విగ్రహం పద్మాసన భంగిమలో, ధ్యాన ముద్రలో ఉంటుంది. ఈ నారాయణుడు పరమ శాంతికి, మోక్షమార్గాన్ని చూపిస్తాడని నమ్మకం.

మూడు తాళాలతో తెరచుకుని తలుపులుసాధారణంగా ఏ గుడి తలుపులైనా ఒక తాళపు చెవితో తెరుస్తారు. కానీ బద్రినాథ్ ఆలయ తలుపులు మాత్రం మూడు తాళాలు ఉంటేనే తెరుచుకుంటాయి. ఈ మూడు తాళాలు ముగ్గురు వేర్వేరు వ్యక్తుల దగ్గర ఉండడం విశేషం. వీటిలో ఒక తాళపు చెవి తెహ్రీ రాజ్ కుటుంబ పూజారి దగ్గర ఉంటుంది. మరో కీ బద్రినాథ్ ధామ్ మెహతార్ వద్ద ఉంటుంది. ఇంకో తాళపు చెవి హక్ భండారీ ప్రజల దగ్గర ఉంటుంది.బద్రీనాథ్ మహత్యం ఇదే!ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా బద్రీనాథ్ ఆలయం ఏడాదిలో ఆరు నెలలు అక్షయ తృతీయ నుంచి దీపావళి వరకు మాత్రమే తెరచి ఉంటుంది. దీపావళి రోజు ఆలయాన్ని మూసే ముందు శ్రీ మహా విష్ణువు విగ్రహానికి నెయ్యి పూస్తారు. అలాగే అఖండ దీపాన్ని నెయ్యితో వెలిగిస్తారు. ఆరు నెలల తర్వాత అక్షయ తృతీయ రోజు తలుపులు తెరచి చూస్తే స్వామికి అలంకరించిన నెయ్యి చెక్కు చెదరకుండా అలాగే ఉంటుంది. అదేవిధంగా అఖండ దీపం కూడా దేదీప్యమానంగా వెలుగుతూనే ఉంటుంది. ఇది బదరి నారాయణుని మహిమకు నిదర్శనం.దేవతలచే పూజలుబదరీనాథ్ ఆలయం మూసి ఉన్న ఆరు నెలల కాలం దేవతలు, సప్తర్షులు నారాయణుని పూజిస్తారంట! అందుకే ఆరు నెలల తర్వాత చూసినా నారాయణునికి అలంకరించిన పువ్వులు వాడిపోకుండా తాజాగా ఉండడం విశేషం. ఆలయ తలుపులు తెరచిన రోజును జ్యోతిదర్శనమని పిలుస్తారు. ఈ దర్శనం కోసం దేశం నలుమూలల నుంచి భక్తులు విశేషంగా తరలి వస్తారు. అంతేకాదు స్వామివారి విగ్రహానికి పూసిన నెయ్యి చెక్కు చెదరకుండా ఉండిపోతే దేశం సుభిక్షంగా ఉంటుందని నమ్ముతారు.తప్త కుండ్ఆలయానికి సమీపంలోనే వేడి నీటి బుగ్గ ఉంది. భక్తులు ఇందులో స్నానం చేసిన తర్వాతే ఆలయ దర్శనానికి వెళ్తారు. ఈ నీటిలో స్నానం చేయడం వల్ల చర్మ వ్యాధులు, ఇతర రుగ్మతలు తొలగుతాయని విశ్వాసం.బ్రహ్మ కపాలంబదరీనాథ్ ఆలయం సమీపంలో వెలసిన బ్రహ్మ కపాలం సాక్షాత్తు శివుని చేతి నుంచి ఊడి పడిన బ్రహ్మ కపాలమని స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. బద్రీనాథ్ వచ్చే భక్తులు ఇక్కడ తమ పూర్వీకుల ఆత్మలకు శాంతి కలగాలని ప్రత్యేక పూజలు, శ్రాద్ధ కర్మలు నిర్వహిస్తారు. సాధారణంగా ఇళ్లల్లో చేసే శ్రాద్ధ కర్మల కంటే, ఈ పవిత్రమైన ప్రదేశంలో పితృదేవతలకు తిల తర్పణం, పిండప్రదానాలు సమర్పించడం వల్ల పితృదేవతలకు ముక్తి లభిస్తుందని విశ్వాసం.యాత్రాఫలంఛార్‌థామ్ యాత్రలో బద్రినాథ్ థామ్ యాత్ర కూడా చాలా ముఖ్యమైనది. ఇది విష్ణు నివాసమే కాదు.. ఇక్కడ విష్ణువుతో పాటు లక్ష్మీదేవి అనుగ్రహాన్ని పొందొచ్చు. గర్భాలయంలో పద్మాసనంలో ధ్యాన ముద్రలో వెలసి ఉన్న శ్రీహరిని దర్శిస్తే మనసులో ఏది కోరుకున్నా కచ్చితంగా నెరవేరుతుందని నమ్ముతారు. బద్రినాథ్ ఆలయాన్ని సందర్శించే భక్తులపై విష్ణువు, లక్ష్మీదేవి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని నమ్ముతారు. అంతేకాదు గర్భాలయంలో బదరీ నారాయణుని చెంతన కుబేరుడు కొలువై ఉంటాడు. ఇక్కడ ఎర్రటి పట్టు వస్త్రంలో రూపాయి నాణేలు ఉంచి కుబేరుని చెంత ఉంచి పూజించి ఇంటికి తెచ్చుకుంటారు. ఇలా చేయడం వలన జన్మజన్మల దారిద్ర్యం తొలగి అష్టైశ్వర్యాలు సద్ధిస్తాయని సాక్షాత్తు నారాయణుడే వరమిచ్చాడు.

పూజోత్సవాలుబద్రీనాథ్ ఆలయంలో రోజూ నాలుగు కాలాల్లో అర్చనలు, హారతులు జరుగుతాయి. తొలి ఏకాదశి, కృష్ణాష్టమి వంటి పర్వదినాలు ఇక్కడ ఘనంగా నిర్వహిస్తారు.జీవితంలో ఒక్కసారైనా తప్పకుండా దర్శించాల్సిన దివ్యధామం బదరీనాథ్! మనం కూడా బదరీనాథ్ క్షేత్రాన్ని

# తాళ్లపాకలో బ్రహ్మోత్సవ శోభ- అన్నమయ్యకు అక్షరాభ్యాసం చేసిన చెన్నకేశవ స్వామి ఆలయ విశేషాలు ఇవే!





ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా, రాజంపేటకు 8 కి.మీ దూరంలో ఉన్న తాళ్లపాకలో శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం కలదు. సుప్రసిద్ధ వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలంగా ఈ క్షేత్రం ప్రసిద్ధి చెందింది. దాదాపు 32 వేల కీర్తనలు రచించిన అన్నమయ్య చెన్నకేశవ స్వామి భక్తుడు. అంతేకాదు అన్నమయ్య పూర్వీకులు సైతం ఈ స్వామి భక్తులే. అన్నమయ్యకు స్వామి వారు స్వయంగా అక్షరాభ్యాసం చేయించారని స్థానిక పురాణాలు చెబుతాయి. జులై 25, శనివారం నుంచి చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఈ చరిత్ర గురించి ఈ కథనంలో తెలుసుకుందాం.

**ఆలయ చరిత్ర**

తిరుపతికి దాదాపు 95 కి.మీ దూరంలో ఉన్న తాళ్లపాకలో వెలసిన శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం శ్రీ వైష్ణవ దివ్యక్షేత్రాలలో ఒకటిగా భాసిల్లుతోంది. ఈ దేవాలయం చారిత్రక ప్రసిద్ధి చెందినది. దేవాలయం వద్ద లభించిన శాసనాల ప్రకారం హైహవ వంశీయులు ఈ ప్రాంతాన్ని పాలించినట్లు తెలుస్తుంది. ఈ దేవాలయంలో చెన్నకేశవ స్వామిని త్రేతాయుగంలో కార్తవీర్యార్జునుడు ప్రతిష్ఠించినట్లు స్థలపురాణం ద్వారా తెలుస్తోంది.

**ఉత్తర వాహినిగా చంద్రవంక**

ఈ ప్రాంతంలో చంద్రవంక నది తన గమన దిశను మార్చుకుని ఉత్తరంగా ప్రవహించడం వలన ఈ నది ఉత్తర వాహిని అయ్యింది. అందుచేతనే ఈ ఆలయం మహిమాన్విత క్షేత్రంగా ప్రసిద్ధి పొందింది. శ్రీనాధుని పల్నాటి చరిత్రలో ఈ ఆలయం ప్రాధాన్యత గురించి వివరంగా వర్ణించి ఉంటుంది. శ్రీనాథుడు పల్నాటి వీరచరిత్రను ఈ ఆలయంలోనే రచించడం ప్రారంభించాడట. ఈ ఆలయంలో మంటప స్తంభాలు చోళ రాజుల కాలం నాటి శిల్పకళా శోభకు సాక్ష్యాలుగా నిలుస్తాయి.

**ఆలయ విశేషాలు**

శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయం ఆలయంలో కొలువై ఉన్న శ్రీ చెన్నకేశవ స్వామి నాలుగు చేతులలో శంఖు, చక్ర, గదా, అభయ హస్తాలతో భక్తులను అనుగ్రహిస్తున్నారు. అలాగే శ్రీకృష్ణుడు, సుదర్శన చక్రం, గోపాల స్వామి, ఆంజనేయ స్వామి వారి ఉపాలయాలను కూడా దర్శించుకోవచ్చు. ద్రావిడ నిర్మాణ శైలిలో అద్భుతంగా నిర్మితమైన ఈ ఆలయంలో నల్లరాతితో చెక్కిన సుదర్శన చక్రం, దాని కింద ఉన్న నవనీత కృష్ణుడు అంటే వెన్న ముద్ద పట్టుకున్న కృష్ణుడు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

**అబ్బురపరిచే శిల్పకళా నైపుణ్యం**

దాదాపు 13 వ శతాబ్దంలో నిర్మించబడిన ఈ దేవాలయ ప్రధాన ద్వారం వద్ద ధ్వజస్తంభం దీనిపై స్వామి విగ్రహం చెక్క, కంచుతో చేయబడి ఉంది. దేవాలయ గాలిగోపురం ముందు ధ్వజస్తంభం ప్రక్కన బ్రహ్మోత్సవాల సమయంలో స్వామి వారి కళ్యాణానికి వినియోగించే కళ్యాణ మండపం ఉంది. ప్రధాన దేవాలయం ముందు బలిపీఠం ఉంది. బలిపీఠానికి దక్షిణం వైపు కప్పక స్తంభం, ఉత్తరాన గిలకల బావి ఉన్నాయి. గర్భగుడి ముందు ఉన్న రంగ మండపంలో నాలుగు రాతి స్తంభాలు ఉన్నాయి. వాటిపై శ్రీ మద్భాగవతము, శ్రీమన్నారాయణ అవతారం, శ్రీ మహాభారతం, శ్రీమద్ రామాయణ గాథలు అద్భుతంగా చెక్కబడి ఉన్నాయి.

**కప్పక స్థంభం**

ప్రధాన ఆలయానికి వెలుపల గరుడ ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించు సమయంలో దాని పై భాగం కొంత విరిగింది. ఆ విరిగిన భాగాన్ని దేవాలయ ఆవరణ లోపన ధ్వజస్తంభం పక్కన ప్రతిష్ఠించారు. దీనిని కప్పక స్తంభంగా పిలుస్తారు. దీని చుట్టూ ప్రదక్షణలు చేస్తే కోరిన కోర్కెలు తీరతాయని భక్తుల విశ్వాసం.

**బ్రహ్మోత్సవాలు**

ప్రతి ఏటా ఆషాఢ మాసంలో తొలి ఏకాదశి నుంచి 9 రోజుల పాటు శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఈ ఏడాది జూన్ 25 శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి.

**బ్రహ్మోత్సవాల షెడ్యూల్**

శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు జూలై 24న అంకురార్పణతో శ్రీకారం చుడతారు. జులై 25 నుంచి ఆగస్టు 2 వరకు స్వామి, అమ్మవార్లు ప్రతిరోజూ వివిధ దివ్య వాహనాలపై మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శమిస్తారు. జూలై 30న సాయంత్రం 6 గంటలకు కల్యాణోత్సవం, ఆగస్టు 3న సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం జరగనుంది.


**ఆధ్యాత్మిక అనుభూతి**

ప్రతిరోజూ వాహనసేవలు సందర్భంగా జరిగే భజనలు, కోలాటాలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తాయి. చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు మనం కూడా తరలి వెళ్దాం. ఆధ్యాత్మిక అనుభూతిని అందుకుందాం.

ఓం శ్రీ చెన్నకేశవ స్వామినే నమఃముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు

# వింధ్యవాసిని అమ్మవారి శక్తిపీఠం ఎక్కడుంది? శ్రీకృష్ణుడి సోదరిగా కొలువైన ఆ క్షేత్రం విశిష్టత, త్రికోణ దర్శనం గురించి తెలుసా?

ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీర్జాపుర్ జిల్లాలో వింధ్య పర్వత శ్రేణుల్లో, పవిత్ర గంగానది ఒడ్డున వెలసిన వింధ్యవాసిని అమ్మవారి ఆలయం అత్యంత ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రంగా భక్తుల విశ్వాసంలో ప్రత్యేక స్థానం పొందింది. దుర్గాదేవి స్వరూపంగా కొలువైన వింధ్యవాసిని అమ్మవారిని శ్రీకృష్ణుడి సోదరి యోగమాయగా కూడా పురాణాలు పేర్కొంటాయి. సతీదేవి శరీర భాగం పడిన ప్రదేశాలతో అనుసంధానమైన శక్తిపీఠ సంప్రదాయంలో వింధ్యాచల్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. వింధ్యవాసిని ఆలయంతో పాటు అష్టభుజ దేవి, కాళికా గుహ ఆలయాలను దర్శించే త్రికోణ యాత్ర కూడా ఈ క్షేత్రంలోని విశిష్టమైన ఆధ్యాత్మిక సంప్రదాయంగా భావిస్తారు. ఈ కథనంలో వింధ్యవాసిని శక్తిపీఠం స్థల పురాణం, యోగమాయగా అమ్మవారి అవతారం, ఆలయ విశేషాలు, త్రికోణ దర్శనం, పరిసరాల్లోని ముఖ్యమైన పుణ్యక్షేత్రాల గురించి తెలుసుకుందాం.



**శక్తిపీఠంగా**

గంగా నది ఒడ్డున మీర్జాపూర్ జిల్లాలో ఉన్న వింధ్యవాసిని దేవాలయం శక్తిపీఠంగా ప్రసిద్ధి చెందింది. వింధ్యాచల్ అత్యంత ప్రసిద్ధి చెందిన శక్తివంతమైన పుణ్యక్షేత్రమని పురాణాలు వర్ణిస్తున్నాయి. దుర్గా సప్తశతి గ్రంథంలో కూడా ఈ పుణ్య క్షేత్రం గురించి గొప్పగా ప్రస్తావించి ఉంది. వింధ్యవాసిని ఆలయ విశేషాలు, స్థల పురాణం గురించి తెలుసుకుందాం.

**స్థల పురాణం**

వింధ్యవాసిని క్షేత్ర స్థల పురాణం ప్రకారం, వింధ్యాచల్ క్షేత్రంలో సతీదేవి ఎడమ చేతి బొటనవేలు పడిందని అంటారు. వింధ్యవాసిని అమ్మవారు దుర్గాదేవి దివ్య స్వరూపం. శివుడు సతీదేవి మృతదేహాన్ని భుజంపై వేసుకుని తాండవం చేస్తున్నప్పుడు, జగత్ కల్యాణం కోసం విష్ణుమూర్తి తన సుదర్శన చక్రంతో ఆమె శరీరాన్ని 51 భాగాలుగా ఖండించాడు. ఆ భాగాలు పడిన ప్రదేశాలే 51 శక్తిపీఠాలుగా మారాయి. ఆ క్రమంలోనే ఇక్కడ అమ్మవారి ఎడమ చేతి బొటనవేలు పడటం వల్ల ఇది అత్యంత పవిత్రమైన శక్తి పీఠాల్లో ఒకటిగా వెలిసింది. ఈ గుడిలో నిరంతరం చుక్క చుక్క నీరు కారుతూనే ఉండడం అంతుచిక్కని మిస్టరీగా మిగిలిపోయింది.

**ఈ క్షేత్రం మరో ప్రత్యేకత**

భాగవతం ప్రకారం, తన సోదరి దేవకీదేవి అష్టమ గర్భంలో జన్మించే పుత్రుని వలన కంసునికి ప్రాణగండం ఉంటుందని ఆకాశవాణి చేసిన హెచ్చరికతో దేవకీ వసుదేవులను కంసుడు చెరసాలలో బంధించి ఉంచుతాడు. పుట్టిన బిడ్డలను పుట్టినట్లే చంపసాగాడు. అయితే చెరసాలలో దేవకీదేవి అష్టమ గర్భంలో శ్రీకృష్ణుడు జన్మించగానే వసుదేవుడు ఆ పసి బాలుణ్ని బుట్టలో ఉంచుకుని యమునా నది దాటి గోకులానికి చేరుతాడు. అక్కడ అప్పుడే ఒక ఆడబిడ్డను ప్రసవించిన యశోద పక్కన చిన్ని కృష్ణుని ఉంచి ఆ ఆడపిల్లను తీసుకుని బయల్దేరి వస్తాడు. యధావిధిగా దేవకీ ప్రసవించిన బిడ్డను సంహరించడానికి వచ్చిన కంసుడు పుట్టినది ఆడపిల్ల అని కూడా చూడకుండా ఆ పసిపాపను గోడకేసి కొడతాడు. అప్పుడు ఆ పాప యోగమాయగా మారి కంసునితో 'నిన్ను సంహరించేవారు గోకులంలో పెరుగుతున్నాడు' అని చెప్పి మాయమవుతుంది.

**వింధ్యవాసినిగా యోగమాయ**

అక్కడ అంతర్ధానమైన ఆ యోగమాయ వింధ్యవాసినిగా వింధ్యాచల పర్వతంపై కొలువుదీరి పూజలందుకుంటోందని భాగవతం ద్వారా తెలుస్తోంది. శ్రీకృష్ణుడి సోదరిగా పిలిచే ఈ దేవత ఆలయం శక్తిపీఠంగా, కోరిన కోర్కెలు తీర్చే పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది.

ఆలయ విశేషాలుఇతర శక్తిపీఠాల్లో కేవలం పడిన శరీర భాగాన్ని మాత్రమే పూజిస్తారు. కానీ వింధ్యాచల్‌లో మాత్రం అమ్మవారు పూర్ణ స్వరూపంతో అంటే విగ్రహ రూపంలో కొలువై ఉండి పూజలందుకోవడం విశేషం.

త్రికోణ దర్శనంవింధ్యాచల్?లో లక్ష్మి, కాళి, సరస్వతి రూపాలను పూజించే మూడు ప్రత్యేకమైన ఆలయాలు ఉన్నాయి. వీటిని దర్శించడం అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు.

**అష్టభుజ ఆలయం**

వింధ్యవాసిని ఆలయం నుంచి 3 కిలోమీటర్ల దూరంలో కొండపై అష్టభుజ ఆలయం వెలసి ఉంటుంది. ఈ పుణ్యక్షేత్రానికి ప్రధాన దేవత అయిన దుర్గాదేవి అవతారమైన అష్టభుజ దేవి ఇక్కడ పూజలందుకుంటుంది. ఈ మందిరం ఉన్న కొండ వద్ద సీతా కుండ్, గెరువా తలాబ్, మొటియా తలాబ్ వంటి మూడు పవిత్రమైన చెరువులు ఉన్నాయి. పూర్వంలో రాజులు తమ ప్రత్యర్థులను, శత్రువులను నాశనం చేసేందుకు, అమ్మవారి ఆశీర్వాదం పొందేందుకు ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించేవారంట!

**కాళికా ఆలయం**

వింధ్యవాసిని ఆలయానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాళికా గుహ మందిరంలో మహాకాళి దేవత పూజలందుకుంటుంది. ఇది అష్టభుజ ఆలయం ఉన్న కొండ దిగువన వెలసి ఉంటుంది.సీతా కుండ్శ్రీ వాల్మీకి రామాయణం ప్రకారం వనవాసం సమయంలో సీతాదేవి వింధ్యాచల్?లోని ్ల చెరువులో స్నానం చేసినట్లుగా తెలుస్తోంది. ఆ తరువాత కాలక్రమంలో ఈ ప్రాంతం సీతా కుండ్?గా ప్రసిద్ధి చెందింది. వింధ్యాచల్?లో తప్పక చూడాల్సిన ప్రదేశాల్లో ఇది ఒకటి.


**రామేశ్వర్ మహాదేవ్ ఆలయం**

రామ్ గయ ఘాట్?లో ఉన్న రామేశ్వర్ మహాదేవ్ ఆలయం వింధ్యవాసిని ఆలయానికి కిలోమీటరు దూరంలో ఉంటుంది. పురాణాల ప్రకారం వశిష్ట మహర్షి ఆదేశానుసారం శ్రీరాముడు మరణించిన తన తండ్రి జ్ఞాపకార్థం ఈ ప్రదేశంలో శివలింగాన్ని ప్రతిష్ఠించినట్లుగా తెలుస్తోంది.

ఎలా చేరుకోవాలి?

వింధ్యాచల్ ప్రముఖ పుణ్యక్షేత్రం వారణాసి నుంచి 63 కి.మీ దూరంలో, అలహాబాద్‌కు సమీపంలో ఉంది. ఇటు వారణాశి నుంచి, అటు మీర్జాపూర్ నుంచి, అలహాబాద్ నుంచి కూడా వింధ్యాచల్?కు రోడ్డు మార్గంలో సులభంగా చేరుకోవచ్చు. వింధ్య పర్వతంపై వెలసివున్న ఈ పుణ్యక్షేత్రం సందర్శన భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు ఆహ్లాదాన్ని కూడా పంచుతుంది. ముఖ్యంగా పర్వతారోప ^కులు పర్వతారోహణ అనుభవంతో పాటు వింధ్యవాసిని ఆశీర్వాదాన్ని కూడా పొందుతారు.

# ఒత్తిడి వల్ల శరీరం విశ్రాంతి కోల్పోతుందా? - నాడీ వ్యవస్థను ప్రశాంతపరిచే మార్గాలు ఇవేనట!



ఒత్తిడి తీవ్రమైతే నాడీ వ్యవస్థ అతిగా స్పందిస్తుంది. దీంతో మనసు ఉద్రిక్తంగా మారుతుంది. శరీరం విశ్రాంతిని కోల్పోతుంది. ఈ క్రమంలో నాడుల స్పందనను నెమ్మదింపజేయడానికి ఎన్నో పరిష్కారాలు ఉన్నాయంటున్నారు నిపుణులు.

ఆలోచనల నుంచి వర్తమానంలోకి : ఒత్తిడి, ఆందోళన తరచూ శరీరంలో మొదలవుతుంది కానీ, మనసులో కాదు. ఇది నాడీ వ్యవస్థను శాంతపరచడం ద్వారా జరుగుతుంది. కాబట్టి, మన ఆలోచనల్ని దానిపై మళ్లించడం, శ్వాసను గమనించాలి. అలాగే, నేలపై మన పాదాలను అనుభూతి చెందడం, చుట్టూ ఉన్న పరిసరాలపై శ్రద్ధ పెట్టాలి. ఇది మిమ్మల్ని ఆలోచనల నుంచి బయటకు తీసుకువచ్చి, వర్తమానంలోకి తీసుకురావడానికి సహాయపడుతాయని నిపుణులు చెబుతున్నారు. తద్వారా, ఒత్తిడి తగ్గుతుందంటున్నారు.మానసిక స్థితిని అర్థం చేసుకోవడం : నాడీ వ్యవస్థ ఎప్పుడు ఉత్తేజితమవుతుందో మొట్టమొదట గుర్తించాలి. 'ఇప్పుడు నా శరీరంలో ఏం జరుగుతోంది? నేను కోపంగా, అశాంతితో లేదా ఆందోళనగా ఉన్నానా? అని మనల్ని మనం ఆత్మావలోకనం చేసుకోవాలి. ఇలా చేస్తే ప్రతిచర్య, ప్రతిస్పందన మధ్య ఓ విరామాన్ని సృష్టించి ఒత్తిడిని దూరం చేస్తుందంటున్నారు నిపుణులు

"ప్రెగ్నెన్సీ"లో నిద్ర పట్టడం లేదా? - ఇలా చేస్తే మంచిదట!వేగాన్ని తగ్గించుకోవడం : ఒత్తిడి, ఆందోళన అత్యవసరాన్ని సృష్టిస్తాయి. ప్రతి పని ముఖ్యమైనదిగా అనిపిస్తుందట. మన నాడీ వ్యవస్థ వేగానికి ప్రతిస్పందిస్తుంది. కాబట్టి, కదలికలు, మాటలు, శ్వాసను నెమ్మదిగా చేయడం ద్వారా మనం సురక్షితంగా ఉన్నామని శరీరానికి సంకేతం పంపొచ్చని నిపుణులు సూచిస్తున్నారు.మనం తరచూ ఒత్తిడి, ఆందోళనకు గురైనట్లు లేదా విశ్రాంతి లేనట్లుగా కనిపిస్తే, ఈ స్థితిలో ఎక్కువ సేపు గడిపామని దానర్థం. ఇలాంటప్పుడు ఒత్తిడి, ఆందోళన ఎక్కడ మొదలైందో ఆలోచించాలి. నాడీవ్యవస్థ స్తంభించడానికి కారణాలను తెలుసుకోవాలి. నాడీవ్యవస్థను నియంత్రించుకోవాలి. అంటే, మన శరీరం ప్రశాంతంగా ఉండటానికి తగినంత సురక్షితంగా భావించేలా సహాయపడాలి. - ఒవెన్ ఓ కెన్, బ్రిటన్?కు చెందిన సుప్రసిద్ధ మనోవైద్య నిపుణుడు

అంతర్గత సంఘర్షణకు చెక్ : ఒత్తిడి భావనను ప్రతిఘఆలోచనల నుంచి వర్తమానంలోకి : ఒత్తిడి, టించడానికి బదులుగా దాన్ని అనుమతించాలట. మన భావాలతో పోరాడినప్పుడు మరో పొర ఉద్రిక్తతను జోడించినట్లు లెక్క. ఆందోళనకు అడ్డుపడకుండా ఉండే అది అంతర్గత సంఘర్షణను తగ్గిస్తుందని నిపుణులు చెబుతున్నారు. నాడీ వ్యవస్థ కుదుటపడటానికి సహాయపడుతుందని అంటున్నారు.

బ్రేక్ తీసుకోవడం : ఒత్తిడి వలయంను ముందుగానే నిలువరించాలట. మనం తీసుకునే చిన్న బ్రేక్ కూడా ఈ వలయం తీవ్రం కాకుండా ఆపగలదు. ఈ క్రమంలో ఒత్తిడి సంకేతాలను ఎంత ముందుగా గమనిస్తే, స్పందన అంత సువుతుందని నిపుణులు సూచిస్తున్నారు.రోజువారీ అలవాట్లలో మార్పులు : రోజులో సురక్షితమైన క్షణాలను సృష్టించుకోండి. మన నాడీవ్యవస్థ నిరంతరం సంకేతాల కోసం వెతుకుతూ ఉంటుంది. ఏ విధమైన ఆటంకాలు లేకుండా కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగా కూర్చోవడం, కొద్దిసేపు నడవడం, నిరంతర సమాచార ప్రసారానికి దూరంగా ఉండటం క్రమం తప్పకుండా చేసినప్పుడు, చిన్న విరామాలు కూడా ఆందోళన నుంచి ఉపశమనానికి తోడ్పడతాయని నిపుణులు సలహా ఇస్తున్నారు.

ఒత్తిడిలో ఓ సాధారణ ధోరణ ఏమిటంటే, మనం అనుకున్న రీతిలో దాన్ని పరిష్కరించాలనుకోవడం. కానీ ఇది తరచుగా మరింత ఒత్తిడిని సృష్టించగలదని నిపుణులు చెబుతున్నారు. ఆందోళన అనేది మానవ సహజమని, దాన్ని పూర్తిగా తొలగించాల్సిన అవసరం లేదంటున్నారు నిపుణులు.

శరీరం సహజ ప్రతిస్పందన : ముప్పును పసిఆలోచనల నుంచి వర్తమానంలోకి : ఒత్తిడి, గట్టినపుడు శరీరం సహజంగానే పోరాటమైనా చేస్తుంది లేదా పలాయన మార్గాన్ని ఎంచుకుంటుంది. ఆ సమయంలో వేగవంతమైన శ్వాస, కండరాలు బిగువుగా మారడం, గుండె వేగంగా కొట్టుకోవడం, అప్రమత్తం కావడం లాంటివి ఉండొచ్చంటున్నారు నిపుణులు. ఇవన్నీ మనల్ని మనం రక్షించుకోవడానికి ఉద్దేశించినవట. కానీ, మన నాడీ వ్యవస్థ వాస్తవ ప్రమాదానికి, ఆందోళనకరమైన ఆలోచనలకు మధ్య తేడాను ఎల్లప్పుడూ గుర్తించదు. కాబట్టి, రోజువారీ ఒత్తిడి కూడా పోరాటం లేదా పలాయనం ప్రతిస్పందనను ప్రేరేపించొచ్చట. మనం పోరాటం లేదా పలాయన స్థితిలో చిక్కుకుపోయినట్లు భావిస్తే, దాని నుంచి బలవంతంగా బయటకు రావడం లక్ష్యం కాకూడదని నిపుణులు చెబుతున్నారు. దానికి బదులుగా, శరీరానికి సున్నితంగా భద్రతా సంకేతాలు ఇవ్వడంపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు.: ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి

- ఫిర్యాదులు రీ-ఓపెన్ కాకుండా అర్థవంతమైన, శాశ్వత పరిష్కారం చూపాలి
- అపరిష్కృత సమస్యల పరిష్కారానికే ప్రత్యేక ఎ ీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం

... జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు

**విజయవాడ (పటమట): జూలై 31,2026:** ప్రజల నుంచి అందుతున్న పీజీఆర్ఎస్ ఫిర్యాదులను అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా పరిశీలించి, రీ-ఓపెన్ అయ్యే పరిస్థితి లేకుండా శాశ్వత, అర్థవంతమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాలు ఫలితాలపై దృష్టి సారించాలని సూచించారు. 'ఒక నెల -- ఒక నియోజకవర్గం -- నాలుగు- సందర్శనలు' కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల ఒక నియోజకవర్గాన్ని ఎంపిక చేసి నాలుగు శుక్రవారాలు ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, నాలుగో విడత కార్యక్రమాన్ని శుక్రవారం పటమట ఎన్ఎస్ఎం పబ్లిక్ స్కూల్ రోడ్డులోని నల్లూరివారి కళ్యాణ మండపంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్



జి.లక్ష్మీశ, విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, సంబంధిత అధికారులతో సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, విజయవాడ తూర్పు నియోజకవర్గంలో జూలై 3, 10, 17 తేదీల్లో నిర్వహించిన మూడు విడతల ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాల్లో 241 అర్జీలు స్వీకరించగా, నాలుగో విడతలో 137 అర్జీలు అందాయని తెలిపారు. దీంతో నాలుగు విడతల్లో మొత్తం 378 అర్జీలు స్వీకరించినట్లు పేర్కొన్నారు. స్వీకరించిన ప్రతి అర్జీని సంబంధిత శాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఫిర్యాదులు మళ్లీ రీ-ఓపెన్ అయ్యే పరిస్థితి రాకుండా నాణ్యమైన పరిష్కారం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు మాట్లాడుతూ, ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాల ద్వారా ఇప్పటికే నియోజకవర్గంలోని అనేక ప్రజా సమస్యలకు పరిష్కారం లభించిందని తెలిపారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్న అధికారులను ఆయన అభినందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా త్వరలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా పీజీఆర్ఎస్ కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తూ, ప్రజలకు తక్షణ పరిష్కారాలు అందించే సమర్థవంతమైన వేదికగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గంలో నాలుగు విడతల ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి, వీఎంసీ జోనల్ కమిషనర్ ప్రభు కుమార్, అడిషనల్ కమిషనర్ శకుంతల, వివిధ శాఖల జిల్లా అధికారులు, వీఎంసీ సిబ్బంది, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఆగస్టు 1న 2,24,793 లక్షల మంది లబ్ధిదారులకు రూ.98.12 కోట్ల ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ

**.....జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ**

**విజయవాడ: జూలై 31,2026.** జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు సామాజిక భద్రతను బలోపేతం చేసే దిశగా ఆగస్టు 1వ తేదీన విస్తృత స్థాయిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. మొత్తం 2,24,793 మంది లబ్ధిదారులకు రూ.98.12 కోట్ల విలువైన సామాజిక పింఛన్లను పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పథకం కింద ప్రతినెల మాదిరిగానే ఈసారి కూడా పింఛన్లను సమయానికి అందించేందుకు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయ సిబ్బందికి అవసరమైన ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 1వ తేదీ ఉదయం నుంచే స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నేరుగా పింఛన్లు అందజేయాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని మండలాలు మరియు పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారులకు సకాలంలో పింఛన్లు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. మొత్తం రూ.98,11,85,500 కోట్ల నిధులను పంపిణీకి సిద్ధం చేసి, పారదర్శకంగా, సమర్థవంతంగా కార్యక్రమం నిర్వహించాలని అధికారులకు సూచించారు. పింఛన్ల పంపిణీ బాధ్యతలు నిర్వహిస్తున్న సిబ్బంది లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించి, గౌరవంతో పింఛన్లు అందజేయాలని కలెక్టర్ సూచించారు. వృద్ధులు, వికలాంగులు మరియు ఇతర లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని తెలిపారు. పంపిణీ సమయంలో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రతి

# భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నాం


- లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి ఆలయంలో శిఖర పూజ, ధ్వజారోహణ.. పాల్గొన్న నగర సీపీ వీసీ సజ్జనర్







**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 31 (పీపుల్స్ న్యూస్) :** అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ స్పష్టం చేశారు. లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి దేవాలయంలో ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన శిఖర పూజ, ధ్వజారోహణ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సీపీ సజ్జనర్ మాట్లాడుతూ లాల్‌దర్వాజా ఆలయ ఘనమైన చరిత్రను గుర్తు చేస్తూ.. గత 120 సంవత్సరాలుగా ఆషాఢ మాసంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోందని వివరించారు. ఇప్పటికే గోల్కొండ, బల్కంపేట బోనాల



ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యాయని ఆయన తెలిపారు. లాల్‌దర్వాజా బోనాలను కూడా అదే రీతిలో విజయవంతం చేసేందుకు జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, విద్యుత్, ఆర్అండ్ బి తదితర శాఖలతో ఇప్పటికే సమన్వయ సమావేశాలు నిర్వహించామన్నారు. సౌత్ జోన్ పోలీసుల ఆధ్వర్యంలో అదనపు బలగాలతో భద్రతను మరింత కట్టుదిట్టం చేశామన్నారు. 2 వేల మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఈవ్‌టీజింగ్, చైన్ స్నాచింగ్‌లు, జేబు దొంగతనాలు జరగకుండా క్రైమ్ విభాగం, 'షీ టీమ్స్' ద్వారా 24 గంటలూ ప్రత్యేక నిఘా ఉంచుతున్నామని వివరించారు.. బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా, సంతోషకరమైన వాతావరణంలో జరిగేలా భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పోలీసు శాఖకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో అదనపు సీపీ సౌత్ రేంజ్ తఫ్సిర్ ఇక్బాల్, చార్మినార్ జోన్ డీసీపీ ఖరే కిరణ్ ప్రభాకర్, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ సత్యనారాయణ, ఎండో మెంట్ అసిస్టెంట్ కమిషనర్, ఫెస్టివల్ చీఫ్ ఆఫీసర్ ఈ.శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి: భారతీయ జనతా యువ మోర్చా డిమాండ్




**పటాన్‌చెరు, జూలై 31:** రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు నిలిచిపోయిన ఫీజు రీఎంబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో పటాన్‌చెరు అసెంబ్లీ పరిధిలో సమరభేరి మోగించారు. భారతీయ జనతా యువ మోర్చా డిమాండ్ రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్ పిలుపు మేరకు, సంగారెడ్డి జిల్లా భారతీయ జనతా యువ మోర్చా డిమాండ్ అధ్యక్షులు బోర్ర ప్రవీణ్ యాదవ్ సూచనలతో బీరంగూడ ప్రాంతంలో విస్తృత నిరసన మరియు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక అన్న అకాడమీ కాలేజ్, గరుడ కాలేజ్ మరియు విజన్ ఒకేషనల్ కాలె?జీలను సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రతి విద్యార్థి నుండి సంతకాలు సేకరించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆడుకుంటోందని, వెంటనే బకాయిలు విడుదల చేయకపోతే భవిష్యత్తులో పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ఈ సందర్భంగా భారతీయ జనతా యువ మోర్చా డిమాండ్ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ఆగస్టు 1 నుంచి మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ

- రేషన్ కార్డుల ఈకేవైసీ గడువు ఆగస్టు 31 వరకు పొడిగింపు



**మెదక్, జూలై 31** మెదక్ జిల్లా పరిధిలోని అన్ని రేషన్ కార్డుదారులు ప్రభుత్వం అందిస్తున్న ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్--2026 నెలలకు సంబంధించిన మూడు నెలల బియ్యం కోటాను ఆగస్టు 1 నుంచి తమ సమీప ఫెయిర్ ప్రైస్ షాపుల (ఎఫ్ సి ఎస్) ద్వారా ఒకేసారి పొందాలని జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద తెలిపారు. అలాగే రేషన్ కార్డులోని ప్రతి కుటుంబ సభ్యునికి ఆగస్టు 31లోపు ఈ కేవైసీ తప్పనిసరిగా పూర్తి చేయించాలని సూచించారు. చిన్నారుల ఈ కేవైసీ ను ఐరిస్ డివైస్ ద్వారా సులభంగా నమోదు చేయవచ్చున్నారు. ఎఫ్ పి ఎస్ డీలర్లు నిర్ణీత సమయానికి దుకాణాలు తెరిచి మూడు నెలల బియ్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయాలని, ఈ కేవైసీ పెండింగ్‌లో ఉన్న ప్రతి లబ్ధిదారునికి సమాచారం అందించి 100 శాతం ఈకేవైసీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో మైక్ అనౌన్స్‌మెంట్‌ల ద్వారా మూడు నెలల రేషన్ పంపిణీ, ఈకేవైసీవ పై విస్తృత ప్రచారం నిర్వహించాలని, బియ్యం పంపిణీతో పాటు ఈ కేవైసీ ప్రక్రియను సమాంతరంగా నిర్వహించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలని జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

## వృద్ధురాలి హత్య కేసులో దంపతులకు జీవిత ఖైదు

రూ.14వేల జరిమానా విధింపు -- దర్యాప్తు అధికారులను అభినందించినఎస్పీ




**మెదక్ టుడే జులై 31:** వృద్ధురాలిని హత్య చేసి రూ.4 లక్షల నగదును అపహరించిన కేసులో నిందితులైన బి. కీరాజీ (36), జక్కుల చంద్రకళ (34)లకు మెదక్ జిల్లా ప్రధాన న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.7 వేల చొప్పున మొత్తం రూ.14 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం, 2020 అక్టోబర్ 11న ఆర్థిక ఇబ్బందుల కారణంగా చంద్రకళ తల్లి రాధను హత్య చేసి ఆమె వద్ద ఉన్న రూ.4 లక్షల నగదును నిందితులుఅపహరించారు. దర్యాప్తులో నేరం రుజువుకావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. నీలిమ జీవిత ఖైదు శిక్ష విధించారు. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు నిర్వహించిన దర్యాప్తు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి. వెంకటేశ్, కోర్టు లైజనింగ్ అధికారులు, పోలీసు సిబ్బంది కృషిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.

## మహిళల భద్రతే లక్ష్యం.. జూలైలో 77 మందికి కౌన్సెలింగ్, 9 మందిపై కేసులు




**మెదక్ టుడే జులై 31:** మహిళలు, బాలికల భద్రతకు మెదక్ జిల్లా పోలీస్ శాఖ ప్రాధాన్యం ఇస్తోందని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. జూలై నెలలో షీ టీం ప్రత్యేక తనిఖీల్లో 77 మందికి కౌన్సెలింగ్ నిర్వహించగా, 9 మందిపై ఈ-పెట్టీ కేసులు నమోదు చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 46 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. వేధింపులకు గురైతే భయపడకుండా వెంటనే షీ టీం లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

# రవాణా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోండి

**- సమయానికి సభా ప్రాంగణానికి బస్సులు చేరుకోవాలి**
**మంత్రి కొండపల్లి శ్రీనివాస్**





**విజయనగరం జులై 31,**
ప్రధాని నరేంద్ర మోడీ గారు పాల్గొని ఎయిర్పోర్ట్ ప్రారంభానికి వచ్చే ప్రజలకు రవాణా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ట్రాన్స్పోర్ట్ కమిషనర్ బాలసుబ్రమణ్యం, డైరెక్టర్ ఆఫ్ సర్వే అండ్ సెటిల్మెంట్స్ రోనంగి కూర్మనాథం లతో ప్రత్యేక రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం 7 కల్లా బస్సులు ప్రాంగణానికి చేరుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఉత్తరాంధ్రలోని అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల నుండి 4734 బస్సులు ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారికి తెలియజేశారు. ఈ బస్సుల ద్వారా మొత్తం 2 లక్షల 12 వేల 500 మంది ప్రధాని నరేంద్ర మోడీ గారి సమావేశానికి హాజరవుతారని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి సభా ప్రాంగణానికి రావడానికి వచ్చే సమయాన్ని బట్టి బస్సుల షెడ్యూలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనాలలో వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్లాట్స్ వారీగా బస్సులు సభాస్థలికి చేరుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రత్యేక యాప్ నుంచి ఏ బస్సు ఎక్కడ ఉన్నది తెలుసుకునే విధంగా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రి కి తెలిపారు. బస్సు తిరుగు ప్రయాణంలో భోజనాలకు ఆగవలసిన స్థలాలను, ఇన్చార్జులు, టీమ్ మెంబర్స్ ద్వారా అవగాహనతో ముందుకు సాగాలని సూచించారు. వాహనాల ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసు మరియు రవాణా వ్యవస్థ సంయుక్తంగా తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు, పాల్గొన్నారు.

## భోగాపురం చేరుకున్న విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్.



**భోగాపురం :** లోకేష్ కు స్వాగతం పలికిన టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, కొలుసు పార్థసారథి, ఎంపీ అప్పలనాయుడు గార్లు

# ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు ప్రారంభం కోసం ఉత్కంఠ

- ప్రధాని పర్యటనకు సర్వం సన్నద్ధం
- చంద్రబాబు గారి సంకల్పంతో పనులు పూర్తి
- భోగాపురంపై జగన్ అవాస్తవాలు
- ప్రజలను తప్పుదోవ పట్టించడానికి జగన్ పర్యటన
- మహిళ ఎస్ఐ పై దురుసు ప్రవర్తన దారుణం
- ఎయిర్‌పోర్ట్ ప్రారంభం గురించి ప్రధాని ట్రీట్ చేయడం ఆనందంతో పాటు గర్వాన్ని కలిగించింది
- విలేకర్ల సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు గారు





**విజయనగరం, జులై 31:**
ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు విడుచుకునే సమయం శ్రీ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కోసం ఎంతో ఉత్కంఠతో ఉత్తరాంధ్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఎయిర్‌పోర్ట్ మీడియా పాయింట్లో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు గారితో కలిసి విలేకర్లతో మాట్లాడారు. మంత్రి కొండపల్లి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ గారి పర్యటనకు సర్వం సన్నద్ధమైందని తెలిపారు. స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ గారు ట్విట్టర్లో అల్లూరి ఎయిర్పోర్ట్ ప్రారంభాన్ని ప్రస్తావిస్తూ పోస్ట్ చేయటం ఆనందం కలిగించడంతో పాటు గర్వంగా ఉందన్నారు. అరకు ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన, ప్రాముఖ్యత కలిగిన థీంసా నృత్యాన్ని 13 వేల మంది కళాకారులతో, 250 మంది కూచిపూడి కళాకారులతో ప్రధానమంత్రికి స్వాగతం పలకటం జరుగుతుందన్నారు. విమానాశ్రయం ప్రారంభానికి ప్రధాని మోడీ గారితో పాటు గవర్నర్ అబ్దుల్ నజీర్ గారు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు ఇతర మంత్రులు పాల్గొంటారన్నారు. 3 లక్షల మంది పైగా హాజరవుతారని అంచనాతో పగడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. భోగాపురంపై వైకాపా అధినేత అవాస్తవాలు మాట్లాడుతున్నారని, నాడు ఎర్ర బస్సు కూడా రాని భోగాపురానికి ఎయిర్ బస్సు వస్తుందా ? అని ఎగతాళి చేస్తూ మాట్లాడిన వీడియోలు సాక్ష్యాలుగా మిగిలాయన్నారు. క్రెడిట్ చోరీకి ప్రయత్నించడంలో వైకాపా పార్టీ నాయకులు సిద్ధ హస్తులు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలలోనే ప్రపంచంలోనే అత్యంత సుందరంగా విమానాశ్రయాన్ని నిర్మించడం జరిగిందన్నారు. విమానాశ్రయం ద్వారా రవాణా వ్యవస్థ మెరుగుపడి భావితరాలకు మంచి సువర్ణ అవకాశాలను కల్పిస్తుందన్నారు. తప్పుచేసి జైలులో ఉన్న మాజీ మంత్రి అప్పలరాజును ములాఖత్ పేరుతో, పరామర్శ పేరుతో బల ప్రదర్శన చేసిన జగన్.. ములాఖత్ సమయం దాటినా వెళ్లకుండా ప్రజలను మభ్యపెట్టటం జరిగిందన్నారు. ఏ ఒక్క వైకాపా నాయకుడు కూడా బాధిత కుటుంబాన్ని పరామర్శించకుండా తప్పు చేసిన జైలులో ఉన్న మాజీ మంత్రి అప్పలరాజుని కలవటం ఏమిటని ప్రశ్నించారు.

అంతేకాకుండా గొడ్డలి పార్టీ అధినేత సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాల వద్దకు, మృతుడు దానయ్య కుటుంబం వద్దకు స్వయంగా మంత్రి హోదాలో తానే వెళ్ళినప్పటికీ మభ్యపెట్టే మాటలతో మంత్రులు వెళ్లలేదని అవాస్తవాలు పలకటం సిగ్గుచేటని అన్నారు. ప్రధాని వచ్చే సమయంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని ఇరుకున పెట్టడం కోసం సమయాన్ని వృధా చేయటం కోసం ప్రజల దృష్టి మరల్చటం కోసం జగన్ రెడ్డి పర్యటన చేశారని విమర్శించారు. జగన్ రెడ్డి వలెనే వైకాపా నాయకులు కూడా మహిళా ఎస్సై అని చూడకుండా అసభ్యంగా ప్రవర్తించటం వైకాపా నాయకులకే చెల్లుబాటు అన్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరూ జగన్ చేస్తున్న ఆగడాలను, ఆటంకాలను చూస్తూనే ఉన్నారన్నారు.

ఎంపీ కలిశెట్టి మాట్లాడుతూ విమానాశ్రయ ప్రారంభానికి ప్రజలంతా స్వచ్ఛందంగా వస్తున్నారని, మినిట్ టూ మినిట్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి పర్యవేక్షణలో అత్యంత వైభవంగా విమానాశ్రయం ప్రారంభించడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల ప్రకారం ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పండగ వాతావరణంలో అల్లూరి విమానాశ్రయం ప్రారంభానికి సిద్ధం అయిందన్నారు. గొడ్డలి పార్టీ అధినేత ఉద్దేశపూర్వకంగా పర్యటన ఏర్పాటు చేసి తప్పుచేసిన అప్పలరాజును పరామర్శించడం ఎంతవరకు సబబు ? అని ప్రశ్నించారు. రాజకీయాల వేరు అభివృద్ధి వేరు అనే సిద్ధాంతంతో రాజకీయాలకు సంబంధం లేకుండా కూటమి ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలకు జగన్ రెడ్డి క్షమాపణ చెప్పాలని, అధికారుల్లో మనోధైర్యాన్ని కోల్పోయే విధంగా ఒక మహిళ ఎస్సై పై దాడి చేయటం అత్యంత బాధాకరమన్నారు. జగన్ తీరును ప్రధానమంత్రి దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. ఐదు సంవత్సరాలు అధికారంలో ఉన్న గొడ్డలి పార్టీ 500 ఎకరాలు కబ్జా చేయడానికి చూసిందన్నారు. పరామర్శ చేయకుండానే జగన్ తిరుగు ప్రయాణంలో బెంగుళూరు వెళ్ళటం సిగ్గుచేటని అన్నారు. మీడియా సమావేశానికి ముందు ప్రధానమంత్రి ప్రసంగించే సభా స్థలాన్ని, వేదికను, ఏర్పాట్లను అలాగే పర్యటనలో వివిఐపి, విఐపి విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు., పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ ను సందర్శించి పోలీసు అధికారులతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, ప్రజలకు, కళాకారులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు.

# కేంద్ర ప్రభుత్వానికి చెందిన యువజన వ్యవహారాలు,

**విజయవాడ, 31.07.2026**
కేంద్ర ప్రభుత్వానికి చెందిన యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ సంబంధించిన మై భారత్ ఆధ్వర్యంలో నషాముక్తి యువ కార్యక్రమం జరగనున్నది. కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 2 అనగా ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారితో సుమారు పదివేల చోట్ల దాదాపు కోటి మంది యువతతో ఆన్లైన్ మాధ్యమంలో ముచ్చటించనున్నారు. యువత అందరూ కలిసి సామూహికంగా నషాముక్తి ప్రతిజ్ఞ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విజయవాడలో లోక్ భవన్ లో గౌరవ గవర్నర్ గారితో కలిసి మైభారత్ కార్యకర్తలు నషాముక్తి ప్రతిజ్ఞ చేయనున్నారు. కావున ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని ఆన్లైన్ మాధ్యమంలో వీక్షించి వికసిత్ భారత్ కోసం చేస్తున్న ఈ కార్యక్రమానికి తోడ్పాటు అందించవలసిందిగా జిల్లా యువజన అధికారి బి.ప్రదీప్ కుమార్ పిలుపునిచ్చారు.

# మాలల స్థానం ఎక్కడ...?

**-మాలలపై చిన్నచూపు చూపిస్తున్న ఎమ్మెల్యే**
**-కూచిమల్ల నాగేష్, మాలమహానాడు మండల అధ్యక్షులు**



**వలిగొండ జులై 31**
వలిగొండ మండలంలోని మాలలకు అన్ని రకాలుగా అన్యాయం జరుగుతుందని మాల మహానాడు మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్ విలేకరుల సమావేశంలో ఒక ప్రకటన విడుదల చేసి ఆవేదన వ్యక్తం చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండల పిఎసిఎస్ నూతన పాలకవర్గాన్ని, మండల పరిధిలోని వెంకటపురం గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొని ఇటీవల ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. పిఎసిఎస్ పాలకవర్గంలో, శ్రీమత్స్యగిరిలక్ష్మీనరసింహా స్వామి దేవస్థానం పాలకవర్గంలో మాల కులస్తులకు అవకాశం కల్పించలేదని, ఇదంతా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కనుసైగల్లోనే జరిగిందని ఆయన అన్నారు. ఎలక్షన్లలో మాలల ఓటు బ్యాంక్ కావాలి కానీ మాలలకు పదవులలో సముచిత స్థానం కల్పించడంలో మీరెందుకు వివక్ష చూపిస్తున్నారో ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి వలిగొండ మండల మాలలకు సమాధానం చెప్పాలన్నారు. ఆనాడు మీ గెలుపు కోసం ముందుండి పనిచేసిన మాలలకు నేడు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఎలా ఊరుకుంటారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మండల నాయకులైనా మాపై ఆలోచన చేయలేదంటే మాలలపై ఇంత కక్ష ఎందుకో చెప్పాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముందు ముందు వివక్ష లేకుండా మాలలకు సముచిత స్థానం కల్పించి గౌరవించాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు.

# ఫ్యూజన్ AI సమ్మిట్ లాంటి వేదికలతో యువత ఆలోచనలు విస్తృతం

**- విశాఖపట్నంలో ఘనంగా ప్రీమియర్ AI సదస్సు**
**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్**




**విశాఖపట్నం, జూలై 31 :** 'ఫ్యూజన్ AI సమ్మిట్ 2026' 2వ ఎడిషన్ విశాఖపట్నంలోని ఎవీ=ణూా చిల్డ్రన్స్ ఎరీనాలో శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ[illegible] రంగాన్ని కేవలం ఆలోచనల స్థాయి నుంచే కాకుండా ఆచరణాత్మకంగా వేగవంతం చేసేందుకు పాలసీదారులు, గ్లోబల్ టెక్ నాయకులు మరియు పరిశ్రమల నిపుణులు ఈ వేదికపైకి రావడం హర్షణీయమని కొనియాడారు. ఫ్యూజన్[illegible] సమ్మిట్ లాంటి వేదికలు యువత ఆలోచనా పరిధిని పెంచుతాయని.. వాట్సాప్ ద్వారా ప్రభుత్వ విధానాలను తెలుసుకోవడం, ప్రభుత్వ సేవలు పొందడం లాంటి ఏఐ అధారిత సేవలను ఏపీ ప్రభుత్వం రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా అందిస్తోందని మంత్రి విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాలు వెతుక్కునే వారిగా కాకుండా, ఉద్యోగాలు ఇచ్చే వ్యవస్థాపకులుగా ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు.గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, ఐటీ, విద్యుత్ శాఖల మంత్రి శ్రీ నారా లోకేష్ గారి నాయకత్వం రాష్ట్ర అభివృద్ధికి ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని... పలు సవాళ్లను అధిగమిస్తూ, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు వీరు ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కేవలం ఐటీ రంగానికే పరిమితం కాకుండా, అనేక రకాల అధునాతన సాంకేతిక రంగాలలో పెట్టుబడులను ఆకర్షిస్తూ ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సుమారు 3 కోట్ల మంది తెలుగు ప్రవాసాంధ్రుల అనుభవంతో పాటు వారి పెట్టుబడులను రాష్ట్ర అభివృద్ధిలో భాగం చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని... విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా తమ జ్ఞానం, నైపుణ్యాలతో పరిశ్రమలకు కీలక ఆస్తిగా మారాలని మంత్రి కొండపల్లి కోరారు. ఈ కార్యక్రమంలో [illegible] నెట్‌వర్క్ ఛైర్మన్ కొసరాజు శ్రీధర్ గారు, [illegible] అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ బాతా గారు, టాలెంట్ ఏపీ ప్రెసిడెంట్ నర్రా సురేష్ గారు, [illegible] ప్రెసిడెంట్ దాసరి కిషోర్ గారు, పలు కంపెనీల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత



**తుర్కపల్లి ,జూలై 31** తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామానికి చెందిన నాగయ్య పెల్లి నరసమ్మ ఇటీవల మరణించడంతో ఆమె కుటుంబానికి బొత్త ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ బొత్త రాములు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జింకల ఎల్లేష్ యాదవ్, ఉపసర్పంచ్ గుమ్మడి బాలరాజు ,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గజం వంశీ, వార్డు సభ్యులు జక్కుల శ్రీశైలం ,జూపల్లి తిరుపతి, ఆలేటి శ్రీశైలం, నాగాయపల్లి శంకర్ పాల్గొన్నారు.

# కామన్వెల్త్ గేమ్స్‌లో మెరిసిన సీమా కళీరామన్

### మహిళల డిస్కస్ త్రో విభాగంలో కాంస్య పతకం

### భారత్‌కు అథ్లెటిక్స్‌లో లభించిన నాలుగో పతకం




గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో మహిళల డిస్కస్ త్రో విభాగంలో సీమా కాంస్య పతకం సాధించి, భారత అథ్లెటిక్స్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. భారత సైన్యంలో పనిచేసిన మాజీ బాస్కెట్‌బాల్, జావెలిన్ త్రో క్రీడాకారుడి కుమార్తె అయిన ఈ 27 ఏళ్ల అథ్లెట్, కామన్వెల్త్ వేదికపై అద్భుత ప్రదర్శనతో మూడో స్థానంలో నిలిచారు. ఈ టోర్నీలో భారత్‌కు అథ్లెటిక్స్‌లో లభించిన నాలుగో పతకం ఇది. ఈ పోటీలో సీమా ప్రయాణం సులువుగా ఏమీ సాగలేదు. మొత్తం ఆరు ప్రయత్నాల్లో పలుమార్లు డిస్కస్ పక్కనే ఉన్న నెట్‌కు తగలడంతో నాలుగు త్రోలు ఫౌల్ అయ్యాయి. అయినప్పటికీ, ఒత్తిడికి లోనుకాకుండా కేవలం రెండు చెల్లుబాటు అయ్యే త్రోలతోనే తన నిలకడను చాటుకుని, కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పతకాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. క్రీడా రంగంలో సాధారణంగా పెళ్లి, ప్రసూతి తర్వాత మహిళా అథ్లెట్ల కెరీర్ ముగుస్తుందనే అభిప్రాయం ఉంటుంది. కానీ సీమా విషయంలో 'మాతాత్వం' ఒక అడ్డంకిగా కాకుండా, ఆమె కెరీర్‌ను సరికొత్త మలుపు తిప్పిన అంశంగా మారింది. 2022లో ఆమె కుమారుడు రుద్ర జన్మించకముందు సీమా వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శన 48.08 మీటర్లుగా ఉండేది. ప్రసూతి విరామం తర్వాత 11 నెలల పాటు క్రీడలకు దూరంగా ఉన్న ఆమె, 2024లో బలమైన పునరాగమనం చేసి తన మార్కును 57.19 మీటర్లకు మెరుగుపరుచుకున్నారు. ఈ ఏడాది భువనేశ్వర్‌లో జరిగిన ఇండియన్ ఛాంపియన్‌షిప్‌లో ఏకంగా 59.73 మీటర్ల దూరానికి డిస్కస్ విసిరి కెరీర్ బెస్ట్ రికార్డును నమోదు చేశారు.మె భర్త, కోచ్ రవీందర్ కళీరామన్ కూడా జాతీయస్థాయి (యు-18, యు-20) డిస్కస్ త్రో ఛాంపియన్ కావడం విశేషం. ఆయన శిక్షణలోనే సీమా శిక్షణ పొందుతున్నారు. ఒకవైపు క్రీడల్లో రాణిస్తూనే, భివానీలోని చౌదరి బన్సీలాల్ విశ్వవిద్యాలయం నుంచి ఆమె ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. సీమా కామన్వెల్త్ పతక ప్రయాణం అనేక ఆటంకాలతో సాగింది. తీవ్రమైన మోకాళ్ల గాయం కారణంగా ఆమె దాదాపు మూడు సంవత్సరాలకు పైగా క్రీడలకు దూరమయ్యారు. ఆమె కెరీర్ ముగిసిపోయిందనుకున్న వేళ, పట్టుదలతో పునరావాసం పొంది, మళ్లీ జాతీయస్థాయిలో వెలుగులోకి వచ్చారు. 2025 జాతీయ క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన సీమా, ఆ తర్వాత జాతీయ టైటిల్‌తో పాటు 2026 సౌత్ ఆసియన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచారు. ఈ విజయాల పరంపర ఆమెను 2026 ఆసియా గేమ్స్ మరియు కామన్వెల్త్ గేమ్స్‌కు ఎంపిక అయ్యేలా చేసింది. గాయం నుంచి కోలుకుని, అమ్మగా మారి, పరిశోధకురాలిగా కొనసాగుతూ అంతర్జాతీయ పతకాన్ని ముద్దాడిన సీమా కళీరామన్ విజయం.. కష్టాల్లోనే

# 23 ఏళ్ల తర్వాత సౌతాఫ్రికాలో వన్డే ప్రపంచకప్..




### • జింబాబ్వే,, నమీబియా పాటు సంయుక్తంగా ఆతిథ్యం

వన్డే ప్రపంచకప్ 2027 టోర్నీకి సంబంధించిన 12 వేదికల వివరాలను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) అధికారికంగా ప్రకటించింది. 2027 వన్డే ప్రపంచకప్ టోర్నీకి సౌతాఫ్రికాతో పాటు జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న సంగతి తెలిసిందే. ఈ వన్డే సిరీస్‌లో మొత్తం 57 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ 57 మ్యాచ్‌లు 12 వేదికల్లో జరగనున్నాయి. ఇందులో సౌతాఫ్రికాలో 8 వేదికలు, జింబాబ్వేలో 3, నమీబియాలో ఒక వేదికను ఐసీసీ ఖరారు చేసింది. 2027 వన్డే ప్రపంచకప్ కోసం పూర్తిగా కొత్త ఫార్మాట్‌ను ప్రవేశపెట్టారు. కొత్తగా సూపర్ సిరీస్, సూపర్ 7 వంటి రౌండ్లను చేర్చారు. అంతర్జాతీయ వన్డేల్లో 12 నుంచి 14వ ర్యాంకుల్లో ఉన్న జట్లు ప్రపంచకప్‌కు అర్హత సాధించడానికి సూపర్ సిరీస్ క్వాలిఫయర్స్‌లో ఆడుతాయి. ఇందులో గెలిచిన ఒక జట్టు మాత్రమే ప్రపంచకప్ లీగ్ దశకు అర్హత సాధిస్తుంది.ప్రధాన టోర్నీకి అర్హత సాధించిన 12 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజిస్తారు. ప్రతీ గ్రూప్‌లో 6 జట్లు ఉంటాయి. తమ గ్రూప్‌లో ఇతర జట్లతో ఒక్కోసారి తలపడుతాయి. ఇలా లీగ్ దశలో మొత్తం 30 మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రతీ గ్రూప్ నుంచి టాప్ -3 టీమ్స్.. అలాగే రెండు గ్రూప్‌ల్లో కలిపి మెరుగైన ప్రదర్శన కనబర్చి మరో జట్టు సూపర్-7 దశకు అర్హత సాధిస్తోంది. సూపర్ 7లో రౌండ్ రాబిన్ పద్ధతిలో మొత్తం 21 మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ సూపర్-7 పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానంలో నిలిచిన టాప్-4 టీమ్స్ సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. అగ్రస్థానంలో నిలిచిన జట్టు నాలుగో స్థానంలో నిలిచిన టీమ్‌తో తొలి సెమీఫైనల్ ఆడుతోంది. రెండో స్థానంలో నిలిచిన జట్టు మూడో స్థానంలో నిలిచిన టీమ్‌తో రెండో సెమీఫైనల్ ఆడుతోంది. సెమీస్‌లో గెలిచిన జట్ల మధ్య ఫైనల్ జరుగుతోంది.స్టేడియాల పూర్తి వివరాలు..సౌతాఫ్రికా1. వాండరర్స్ స్టేడియం, జోహన్నెస్‌బర్గ్2. సెంచూరియన్, ష్వాన్3. న్యూలాండ్స్ క్రికెట్ గ్రౌండ్, కేప్ టౌన్4. కింగ్స్‌మీడ్ క్రికెట్ గ్రౌండ్, డర్బన్5. సెయింట్ జార్జ్ పార్క్, కిబెరా6. మాంగాంగ్ ఓవల్, బ్లూమ్‌ఫోంటైన్7. బోలాండ్ పార్క్, పార్ల్8. బఫ్ఫలో పార్క్జింబాబ్వే9. హరారే స్పోర్ట్స్ క్లబ్, హరారే10. క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్, బులావాయో 11. ఫాల్ మోషి-ఓవా-దున్యా అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, విక్టోరియా ఫాల్స్‌నమీబియా12. నమీబియా క్రికెట్ స్టేడియం, విండ్‌హోక్

# ప్రపంచకప్‌కు భువనేశ్వర్‌ను తీసుకోవాలి

### • టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్




2027 వన్డే ప్రపంచకప్ కోసం టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన ప్రతిపాదిత భారత జట్టును ప్రకటించాడు. ఆశ్చర్యకరంగా ఈ టోర్నీకి రిషభ్ పంత్, మహమ్మద్ షమీ వంటి సీనియర్ ఆటగాళ్లు అవసరం లేదని చెప్పిన అశ్విన్.. 36 ఏళ్ల భువనేశ్వర్ కుమార్‌ను కచ్చితంగా తీసుకోవాలని పేర్కొన్నాడు. అయితే 2022 జనవరిలో భువనేశ్వర్ కుమార్ భారత్ తరఫున చివరి వన్డే మ్యాచ్ ఆడాడు.ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆర్‌సీబీ విజేతగా నిలవడంలో భువనేశ్వర్ కుమార్ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. 28 వికెట్లతో సత్తా చాటి అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లోనూ మెరుగైన ప్రదర్శన చేశాడు. తాజాగా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా వన్డే ప్రపంచకప్ 2027 జట్టు గురించి మాట్లాడిన అశ్విన్.. సౌతాఫ్రికా కండిషన్స్‌కు భువనేశ్వర్ కుమార్ బౌలింగ్ సరిగ్గా సరిపోతుందని అభిప్రాయపడ్డాడు.వెంటనే భువనేశ్వర్ కుమార్‌ను జట్టులోకి తీసుకొని మెగా టోర్నీకి సిద్ధం చేయాలని టీమిండియా మేనేజ్‌మెంట్‌ను అశ్విన్ కోరాడు. దేశవాళీ క్రికెట్ టోర్నీలు ఆడి భువనేశ్వర్ కుమార్ కూడా ఫిట్‌నెస్ నిరూపించుకోవాలని అతనికి సలహా ఇచ్చాడు. 'సౌతాఫ్రికా కండిషన్స్‌లో భువనేశ్వర్ కుమార్ వంటి బౌలర్ టీమిండియాకు అవసరం. అతని అనుభవం జట్టుకు కలిసొస్తుంది. అతను వెంటనే ఫస్ట్ క్లాస్ క్రికెట్, విజయ్ హజారే ట్రోఫీ వంటి టోర్నీలు ఆడి ఫిట్‌నెస్ నిరూపించుకోవాలి. సౌతాఫ్రికాలో వన్డే ప్రపంచకప్ ఆడేందుకు సిద్ధం కావాలి.'అని అశ్విన్ పేర్కొన్నాడు. అశ్విన్ ఎంపిక చేసిన జట్టులో రిషభ్ పంత్, సంజూ శాంసన్, మహమ్మద్ షమీతో పాటు వాషింగ్టన్ సుందర్‌లకు అవకాశం కల్పించలేదు. అదే విధంగా కుర్రాళ్లైన వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, శివమ్ దూబే, రవిబిష్ణోయ్‌లను తీసుకోలేదు. యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, రవీంద్ర జడేజా, అర్ష్‌దీప్ సింగ్‌లకు మాత్రం అవకాశం దక్కవచ్చని పేర్కొన్నాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, మహమ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, హార్దిక్ పాండ్యాలను తప్పకుండా వన్డే ప్రపంచకప్ ఆడాల్సిందేనని అశ్విన్ తెలిపాడు. ఫస్ట్ ఛాయిస్ వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్‌ను ఎంపిక చేసిన అశ్విన్.. రెండో కీపర్‌గా ఇషాన్ కిషన్‌ను ఎంచుకున్నాడు.

# శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు జస్ప్రీత్ బుమ్రా


### ఫిట్‌నెస్ పరీక్షలో నెగ్గిన బుమ్రా

### ఆగస్టు 15న టెస్టు సిరీస్ ప్రారంభం




భారత క్రికెట్ అభిమానులకు గుడ్ న్యూస్. టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో తన ఫిట్‌నెస్ పరీక్షను విజయవంతంగా పూర్తి చేసుకున్నాడు. దీంతో జస్ప్రీత్ బుమ్రా శ్రీలంకతో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు పూర్తిగా అందుబాటులో ఉంటాడు.భారత్, శ్రీలంకల మధ్య రెండు టెస్టుల సిరీస్ ఆగస్టు 15న ప్రారంభం కానుంది. రెండో టెస్టు ఆగస్టు 23న జరగనుంది. అంతకుముందు జస్ప్రీత్ బుమ్రా లభ్యతపై సందేహాలు వ్యక్తమయ్యాయి.శ్రీలంక పర్యటనకు భారత టెస్ట్ జట్టులో ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి జస్ప్రీత్ బుమ్రాను ఎంపిక చేశారు. కానీ ఇప్పుడు వైద్య బృందం అతనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో జరిగిన తప్పనిసరి ఫిట్‌నెస్ పరీక్షలో జస్ప్రీత్ బుమ్రా విజయవంతంగా ఉత్తీర్ణుడయ్యాడు. ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో తగిలిన గాయం నుంచి జస్ప్రీత్ బుమ్రా పూర్తిగా కోలుకున్నాడు. అందువల్ల జస్ప్రీత్ బుమ్రా శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల్లోనూ భారత పేస్ బౌలింగ్ విభాగానికి నాయకత్వం వహించనున్నాడు. ఈ గాయం కారణంగా లార్డ్స్‌లో జరిగిన మూడో వన్డేకు బుమ్రా దూరమయ్యాడు. భారత జట్టు ఇప్పటికే గాయాల సమస్యలతో సతమతమవుతున్న తరుణంలో బుమ్రా రీ-ఎంట్రీ ఇచ్చాడు. బుమ్రా రాక బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసి, ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ప్రచారంలో భారత్ అవకాశాలను పటిష్టం చేస్తుంది. శ్రీలంక పర్యటనకు భారత జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), దేవదత్ పడిక్కల్, సాయి సుదర్శన్ (ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి), ధృవ్ జురేల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, సరాంశ్ జైన్.





# ఫైనల్లో అస్మిత ఉడుంపట్టు.. జుడోలో భారత్‌కు మొట్టమొదటి స్వర్ణం..!

కామన్వెల్త్ క్రీడల్లో భారత క్రీడాకారిణులు పోటాపోటీగా పతకాలు కొల్లగొడుతున్నారు. మొన్న పారా షాట్‌పుట్‌లో షర్మిలా ధన్కర్ మొట్టమొదటి స్వర్ణంతో చరిత్ర సృష్టించగా.. జుడోలో అస్మితా డే పసిడి వెలుగులు విరజిమ్మింది. మహిళల 48 కిలోల విభాగంలో చెలరేగిన అస్మిత కెనడా జుడోకా హెడీ క్వాచ్‌నుచిత్తు చేసి దేశానికి నాలుగో స్వర్ణం అందించింది. అంతేకాదు కామన్వెల్త్‌లో జుడోలో గోల్డ్ మెడల్ సాధించిన తొలి భారతీయురాలిగా రికార్డు నెలకొల్పిందీ 23 ఏళ్ల ఛాంపియన్.గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో భారత అథ్లెట్లు జోరు కొనసాగుతున్నారు. జుడోలో అద్భుతంగా రాణించిన అస్మితా డే ఈ విభాగంలో దేశానికి మొట్టమొదటి పసిడి పతకాన్ని అందించింది. శుక్రవారం మహిళల 48 కిలోల ఫైనల్లో ఉడుంపట్టు పట్టిన అస్మిత కెనడా జుడోకా హెడీ క్వాచ్‌ను 2-1తో మట్టికరిపించింది. దాంతో.. జుడోలో మరే భారతీయురాలికి సాధ్యమవ్వని ఘనతను సొంతం చేసుకుంది అస్మిత. చరిత్రాత్మక పతకం సాధించిన అనంతరం సంబురాల్లో మునిగిపోయింది భారత జుడోకా.

# సైమా 2026: నామినేషన్లలో ‘మిరాయ్‘ హవా..

## ఏకంగా 11 విభాగాల్లో పోటీ!




ప్రతిష్ఠాత్మక సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ (సైమా)-2026కు సంబంధించిన నామినేషన్ల జాబితా విడుదలైంది. దక్షిణాది చలనచిత్ర పరిశ్రమలో అత్యంత గౌరవప్రదంగా భావించే ఈ అవార్డుల కోసం సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నిన్న సైమా కమిటీ ఈ నామినేషన్ల జాబితాను అధికారికంగా ప్రకటించింది. ఈసారి తెలుగు విభాగంలో తేజ సజ్జ కథానాయకుడిగా నటించిన ‘మిరాయ్‘ చిత్రం ఏకంగా 11 విభాగాల్లో నామినేషన్లు దక్కించుకుని అగ్రస్థానంలో నిలిచింది. 2025 జనవరి నుంచి డిసెంబర్ మధ్య సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలను ఈ అవార్డుల కోసం పరిగణనలోకి తీసుకున్నారు.

గతేడాది విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన ‘మిరాయ్‘ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.140 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి సంచలనం సృష్టించింది. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో యాక్షన్ అడ్వెంచర్ చిత్రంగా తెరకెక్కిన ఈ సినిమాలో మంచు మనోజ్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించి మెప్పించారు. ఇప్పుడు సైమాలో అత్యధిక నామినేషన్లు సాధించి మరోసారి తన సత్తా చాటుకుంది.

‘మిరాయ్‘ తర్వాతి స్థానంలో ‘సంక్రాంతికి వస్తున్నాం‘ చిత్రం 10 కేటగిరీల్లో నామినేషన్లు సాధించి గట్టి పోటీ ఇస్తోంది. 2025 సంక్రాంతికి విడుదలై కుటుంబ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న ఈ చిత్రం రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో నటించగా, అనిల్ రావిపూడి తనదైన శైలిలో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా దీన్ని రూపొందించారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ ఈ చిత్రంలో ముఖ్య పాత్రలు పోషించారు.

వీటితో పాటు అక్కినేని నాగచైతన్య కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన ‘తండేల్’, మరో చిత్రం ‘కోర్ట్‘ చెరో 9 నామినేషన్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. వాస్తవ సంఘటనల ఆధారంగా చందు మొండేటి దర్శకత్వంలో తెరకెక్కిన ‘తండేల్‘ చిత్రంలో నాగచైతన్య సరసన సాయి పల్లవి నటించారు. ఈ చిత్రం నాగచైతన్య కెరీర్‌లో తొలి వంద కోట్ల సినిమాగా రికార్డు సృష్టించింది.

ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సెప్టెంబర్ 11, 12 తేదీల్లో అట్టహాసంగా జరగనుంది. 2025 సంవత్సరంలో తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విశేష ప్రతిభ కనబరిచిన నటీనటులు, దర్శకులు, సంగీత దర్శకులు, ఇతర సాంకేతిక నిపుణులకు ఈ పురస్కారాలు అందజేయనున్నారు. దీంతో ఏయే చిత్రాలకు, ఏయే నటీనటులకు అవార్డులు వస్తాయనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# ఉత్కంఠ పెంచుతున్న ‘అగధ‘..

## ట్రైలర్ విడుదలకు ముహూర్తం ఖరారు




ప్రముఖ ఫిలింమేకర్ ఎం.ఎస్. రాజు దర్శకత్వంలో రూపొందుతున్న మిస్టిక్ డివైన్ థ్రిల్లర్ ‘అగధ’. ఇప్పటికే విడుదలైన టీజర్, పోస్టర్లతో ప్రేక్షకులలో భారీ అంచనాలను క్రియేట్ చేసిన ఈ సినిమా నుంచి మరో కీలక అప్‌డేట్ వచ్చింది. సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను ఆగస్టు 3వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.

ఈ సందర్భంగా ఓ కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. దట్టమైన అడవిలో ఓ స్త్రీ సాధువు నిలబడి ఉన్న ఈ పోస్టర్, సినిమాలోని ఆధ్యాత్మిక, రహస్యభరితమైన అంశాలపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ పోస్టర్ సినిమాపై ఉన్న ఉత్కంఠను రెట్టింపు చేసింది. టీజర్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన ‘అగధ’ ఇప్పుడు ట్రైలర్‌తో అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లడం ఖాయమని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ ఎల్‌ఎల్ పీ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, అజయ్ కె.ఆర్. సమర్పిస్తున్నారు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న ఈ చిత్రం ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్, సిజ్జు, రోషన్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి రాకేష్ వెంకటాపురం సంగీతం అందించగా, నాని చమిడిశెట్టి సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహించారు.

# ఆద్యంతం అలరించే యాక్షన్ థ్రిల్లర్ ట్రైలర్



దుల్కర్ సల్మాన్ ప్రతిష్ఠాత్మక చిత్రం ’ఐ యామ్ గేమ్’ ట్రైలర్ విడుదలైంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ ట్రైలర్ ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో స్పెషల్ పోస్ట్ పెట్టారు. “ఐయామ్ గేమ్ ట్రైలర్‌లోని ఆ ఫైరీ వైబ్ నాకు బాగా నచ్చింది. మొదటి నుంచి చివరి వరకు ఎంతో గ్రిప్పింగ్‌గా, ఎంగేజింగ్‌గా సాగింది. నా సోదరుడు దుల్కర్ మరో స్పెషల్ మూవీతో వస్తున్నారని నమ్మకం కలిగింది. తనకి మంచి ఫలితాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను. అతనితో పాటు మొత్తం చిత్ర బృందానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు”అని ట్వీట్ చేశారు. ప్రేక్షకులు, అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం 2026 ఆగస్టు 20న ఓణం కానుకగా మలయాళం, తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో పాన్ ఇండియా చిత్రంగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. దుల్కర్ సల్మాన్ వేఫేరర్ ఫిలిమ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ భారీ బడ్జెట్ ఫాంటసీ థ్రిల్లర్, ఆయన కెరీర్‌లోనే అత్యంత భారీ చిత్రంగా రూపొందుతోంది. ఈ చిత్రానికి నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తున్నారు. దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ వేఫేరర్ ఫిలిమ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాజిర్ బాబా, ఇస్మాయిల్ అబూబక్కర్, బిలాల్ మొయిదు స్క్రీన్‌ప్లే అందించగా, సాజిర్ బాబా, ఆదర్శ్ సుకుమారన్, షబాస్ రషీద్ సంభాషణలు రాశారు.

# స్పోర్ట్స్ డ్రామాతో నందమూరి తేజస్విని ఎంట్రీ?:




ప్రముఖ సినీ నటుడు, టీడీపీ హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని త్వరలోనే వెండితెరకు పరిచయం కాబోతున్నారనే వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో, ఫిల్మ్‌నగర్ వర్గాల్లో హల్‌చల్ చేస్తోంది. అయితే, సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, ఒక ప్రయోగాత్మకమైన, యువతకు స్ఫూర్తినిచ్చే స్పోర్ట్స్ డ్రామా ద్వారా ఆమె ఎంట్రీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన కథా చర్చలు శరవేగంగా జరుగుతున్నాయని, అన్ని అంశాలు కుదిరితే త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే ‘అన్‌స్టాపబుల్‘ టాక్ షోకు క్రియేటివ్ హెడ్‌గా, పలు సినిమాలకు నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించిన తేజస్విని... ఇప్పుడు నేరుగా నటిగా మారనున్నారనే వార్తలతో నందమూరి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మోక్షజ్ఞ కంటే ముందే ఆమె సందేశాత్మక చిత్రంతో వెండితెరపై మెరవబోతుండటం సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

# మొదటి సినిమా కష్టాలు..

## ఇప్పుడు స్టార్ హీరోయిన్ రేస్‌లో రితిక!


విశ్వక్సేన్ హీరోగా వచ్చిన ‘అశోక వనంలో అర్జున కళ్యాణం’ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది భామ రితిక నాయక్. తొలి సినిమాలోనే తన నటనతో ఆకట్టుకున్న ఈ బ్యూటీ, ప్రమోషన్ల సమయంలో పడిన బాధను ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పంచుకుంది. కానీ అప్పుడు చూపించిన సహనమే ఇప్పుడు ఆమెకు బ్యాక్-టు-బ్యాక్ ఆఫర్లను తెచ్చిపెట్టింది. ప్రస్తుతం బాక్సాఫీస్ హిట్లు సాధిస్తూ టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ల జాబితాలో చేరిపోతోంది.



‘అశోక వనంలో అర్జున కళ్యాణం‘ రిలీజ్‌కు ముందు రుక్సర్ ధిల్లాన్‌నే ప్రధాన హీరోయిన్‌గా చూపించారు. సర్ ప్రైజ్ కోసం రితిక పాత్రను టీమ్ వ్యూహాత్మకంగా దాచి ఉంచింది. ప్రమోషన్లలో ఎక్కడా ఆమె కనిపించలేదు. లేక లేక వచ్చిన మొదటి సినిమా ప్రమోషన్లలో తను లేకపోవడంతో చాలా బాధపడ్డానని, ఫ్రెండ్‌కు ఫోన్ చేసి ఏడ్చానని రితిక తాజాగా గుర్తుచేసుకుంది. సీన్ రివర్స్.. అదిరిపోయిన ఎలివేషన్: సినిమా థియేటర్లలోకి వచ్చాక అసలైన మ్యాజిక్ జరిగింది. సినిమాలో క్రమంగా రితిక పాత్రే హైలైట్ అవుతూ వెళ్లింది. క్లైమాక్స్ వచ్చేసరికి ఆమె క్యారెక్టర్ ఇచ్చిన ఎలివేషన్ ప్రేక్షకులను మైమరిపించింది. దీంతో అందరూ రితిక గురించే మాట్లాడటం స్టార్ట్ చేశారు. ఆ క్షణంలోనే తనను దాచి ఉంచడం తన మంచికేనని, ఓర్పుగా ఉండటం వల్ల గొప్ప ఫలితం వస్తుందని ఆమెకు అర్థమైంది.

‘మిరాయ్‘ హిట్.. ఇప్పుడు ‘కొరియన్ కనకరాజు‘: తొలి సినిమా తెచ్చిపెట్టిన పేరుతో రితికకు వరుసగా క్రేజీ ఆఫర్లు తలుపు తట్టాయి. యంగ్ హీరో తేజ సజ్జతో కలిసి నటించిన ‘మిరాయ్‘ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. ఈ ప్రాజెక్ట్‌తో రితిక క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి మెగా హీరో వరుణ్ తేజ్ సరసన ‘కొరియన్ కనకరాజు‘ చిత్రంలో జోడీగా నటించింది. ఆగస్టు 7న గ్రాండ్ రిలీజ్: వరుణ్ తేజ్, రితిక నాయక్ కాంబినేషన్‌లో రాబోతున్న ‘కొరియన్ కనకరాజు‘ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ మూవీ ఆగస్టు 7 న రిలీజ్ కానుంది.

# రజనీకాంత్ నుంచి రాశీ ఖన్నాకు ప్రత్యేక బహుమతి






తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ నుంచి అందుకున్న ప్రత్యేక బహుమతి గురించి నటి రాశీ ఖన్నా అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ‘ధర్మన్’ సినిమా చిత్రీకరణలో రజనీకాంత్‌తో కలిసి నటిస్తున్న ఆమెకు ‘లివింగ్ విత్ ది హిమాలయన్ మాస్టర్స్’ అనే ఆధ్యాత్మిక పుస్తకాన్ని ఆయన బహుమతిగా ఇచ్చారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో ద్వారా వెల్లడించారు. ‘ధర్మన్’ షూటింగ్ సమయంలో ఆధ్యాత్మికతపై తమ మధ్య చర్చ జరిగిందని రాశీ తెలిపారు. ఆ సందర్భంగా ఈ పుస్తకం చదివావా అని రజనీకాంత్ అడిగారని చెప్పారు. తాను లేదని చెప్పిన రెండు రోజులకే స్వయంగా ఆ పుస్తకం తీసుకొచ్చి బహుమతిగా ఇచ్చారని వెల్లడించారు. అంతేకాదు, పుస్తకం చదివిన తర్వాత ప్రశ్నలు కూడా అడుగుతానని సరదాగా చెప్పారని గుర్తుచేసుకున్నారు. గత కొన్ని వారాలుగా ఆ పుస్తకాన్ని ఎంతో ఆసక్తిగా చదువుతున్నానని రాశీ చెప్పారు. అందులోని కొన్ని పేజీలు చదివిన ప్రతిసారీ ఆలోచనలో మునిగిపోతున్నానన్నారు. మనలో చాలామంది తమ అసలు వ్యక్తిత్వాన్ని కోల్పోయి, వేరొకరిగా మారేందుకు ప్రయత్నించడం వల్లే అంతర్గతంగా దూరమవుతున్నామనే భావన తనను బాగా ప్రభావితం చేసిందని వెల్లడించారు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో రూపొందుతున్న ‘ధర్మన్’పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. రజనీకాంత్, రాశీ ఖన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం తమిళంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటిగా నిలిచింది.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com